జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

కృష్ణ ఆదివారం 14 జూన్ 2026 సంపుటి : 01 సంచిక : 141 పేజీలు : 12 వెల : 4/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం అధిక జ్యేష్ఠ మాసం గ్రీష్మ ఋతువు ఉత్తరాయణం ప్రదోష వ్రతం సూర్యోదయం : 5.26, సూర్యాస్తమయం 6.29, చంద్రోదయం చంద్రాస్తమయం 4.16-4.43 బహుళ ద్వాదశి సా. 2.00 వరకు తదుపరి త్రయోదశి నక్షత్రం యోగం అతిగండ రా. 12.22 వరకు తదుపరి సుకర్మ భరణి రా. 4.35 వరకు తదుపరి ధృతి కృతిక సా.4.11 వరకు తదుపరి వణజీ రా.2.00 వరకు తదుపరి శకుని

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## అందరికీ నీతులు చెప్పే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉంది



- నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
- ధర్మస్థలం పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని విమర్శ
- కేరళ నుంచి రూ.200 కోట్లతో దుష్ప్రచారం చేశారని ఆరోపణ
- నిజాలు తేలాలని, దోషిగా తేలితే చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్



## భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!

- సుక్కూర్ బ్యారేజ్‌లో పడిపోయిన నీటిమట్టం
- బలూచ్, సింధ్ ప్రావిన్స్‌ల్లో ప్రమాదకర పరిస్థితులు!
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేత ప్రభావం పాక్‌పై తీవ్రం
- సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో కాలువలు ఎండిపోవడంతో రైతుల ఆందోళన
- సింధ్‌కు నీరు అందకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమని నిపుణుల హెచ్చరిక



## పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

- 117 స్థానాల్లో పోటీకి సిద్ధం!
- 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ
- అన్ని 117 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పంజాబ్ బీజేపీ నేతలు

# రెండేళ్లలో మారిన పోలవరం రూపురేఖలు



- పరుగులు పెడుతున్న పనులు
- కూటమి సర్కార్ రాకతో ప్రాజెక్టుకు సరికొత్త వెలుగులు
- డి-వాల్‌ను 14 పూర్తి చేసి రికార్డు సృష్టించిన ప్రభుత్వం
- గోదావరి పుష్కరాల లోపే ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా అడుగులు

**అమరావతి**

తుగ్లక్ మార్క్ నిర్ణయాలు, ఘోర తప్పిదాలు, అడ్డగోలుగా రివర్స్ టెండర్లు, కొట్టుకుపోయిన కోట్ల రూపాయలు. డ్యామేజీలు, సీపేజీలు. గతంలో చేసిన పనులన్నీ గోదావరి పాలు. ఇదీ పోలవరానికి వైఎస్సార్సీపీ చేసిన నష్టాలు. కూటమి సర్కార్ రాకతో కథ మొత్తం మారిపోయింది. ఐదేళ్లు అంధకారంలో ఉన్న ప్రాజెక్టుకు ఇప్పుడు సరికొత్త వెలుగులొచ్చాయ్. సీఎం వ్యూహాలు ఫలించాయ్. నిపుణుల సలహాలు తోడయ్యాయ్. పనులు పరుగులు పెడుతున్నాయ్. మొత్తంగా రెండేళ్లలో - మిగతా 3లో



## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం

- 2029 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండి' కూటమి ఆర్జేడీ గెలిచేసింది
- 2029 ఎన్నికలపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- ఇండి కూటమిలో లోక్‌సభ ప్రతిపక్షనేత స్పీచ్
- పోటీలో గెలవడానికి నిష్పక్షపాతమైన ఎన్నికలే లేవని వ్యాఖ్యలు!
- అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం"

## తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా



- ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి
- వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం
- గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన
- ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్లు పవన్‌కు వివరించిన ఎస్పీ
- అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా

**అమరావతి**

కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని - మిగతా 3లో



## ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

- ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు ప్రధాని మోదీ
- ఫ్రాన్స్, స్లోవేకియా దేశాలకు అధికారిక పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోదీ
- ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక సహకారాల విస్తరణపై ప్రధాన దృష్టి
- భారత్, ఫ్రాన్స్ స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ సమీక్ష

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం



- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత

**అమరావతి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా - మిగతా 3లో

# భీమునిపాడులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం డ్రోన్ కెమెరాలతో విస్తృత తనిఖీలు**
**అక్రమ మద్యం స్వాధీనం...., ముగ్గురి అరెస్ట్**
**ఇన్స్పెక్టర్ హనుమంత్ నాయక్ ,కోయిలకుంట్ల**



**కోవెలకుంట్ల,జూన్,13, ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ గారి ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ డి.ఎస్.పి శ్రీనివాసరావు గారి సూచనలతో ఈరోజు తెల్లవారుజామున భీమునిపాడు గ్రామంలో పోలీసులు భారీ ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలు కోయిలకుంట్ల ఇనస్పెక్టర్ హనుమంత్ నాయక్ గారి ఆధ్వర్యంలో సంజమాల ఎస్సై రమణయ్య , రేవనూర్ ఎస్సై ధనుంజయులు, కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డి మరియు పోలీసు సిబ్బందితో కలిసి ఈ సంయుక్త తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అయిన డ్రోన్ కెమెరాలను వినియోగించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 35 క్వార్టర్ మద్యపు సీసాలను (బాటిళ్లను) మరియు 8 బీర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కార్డన్ అండ్ సెర్చ్ అనంతరం పోలీసులు భీమునిపాడు గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోయిలకుంట్ల సిఐ మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటిపి (ఓటిపి)లు, బ్యాంకు వివరాలు చెప్పకూడదని, అనుమానిత వ్యక్తుల నుండి వచ్చే నకిలీ లింకులను మరియు ఎపికే ఫైల్స్ లను క్లిక్ మరియు డౌన్లోడ్ చేయవద్దని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు గాని డబ్ల్యు డబ్ల్యు క్రైమ్ గోవిగ్ అనే వెబ్సైట్లో గానీ ఫిర్యాదు చేయాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఇనస్పెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కోయిలకుంట్ల, సంజమాల, రేవనూర్ పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కోయిలకుంట్ల ఇనస్పెక్టర్ వారి కార్యాలయం,

# విద్యార్థి సంఘాల నాయకులు ను రాయలసీమ యూనివర్సిటీ నుండి తొలగించడం అన్యాయం

**యూనివర్సిటీ లోకి విద్యార్థి సంఘాలు నాయకులు ని అనుమతించకుంటే రాయలసీమ యూనివర్సిటీ ని ముట్టడిస్తాంలి. ఆర్ ఎస్ ఎ బందెల ఓబులేసులి రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్ (బిఎ ఎల్ ఎల్ బి)**



**కోవెలకుంట్ల:జూన్=13 ప్రజాజ్యోతి** ఈ సందర్భంగా బందెల ఓబులేసు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ లో జరిగే అన్యాయాలు అక్రమాలు, వీసీ యొక్క అరాచకాలు గురించి పోరాడుతున్న ఆర్ పి యస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పైన అక్రమ కేసులు ఎత్తి వేయాలి మరియు ఎఐయస్ ఎఫ్. జిల్లా సహాయ కార్యదర్శి శరత్ ల ను రాయలసీమ యూనివర్సిటీ నుండి తొలగించడం చాలా దుర్మార్గమైన చర్య, అంతేకాకుండా, ఎన్నో ఏండ్లుగా ఉద్యమాలు చేస్తూ విద్యార్థుల కోసం వారి సంక్షేమమం కోసం పోరాడుతుంటే వారి పైన నిర్దాక్షిణ్యంగా వారిని తొలగించడం సరికాదని ఆయన అన్నారు.అంతేకాకుండాలి ప్రస్తుత రిజిస్టర్ విజయ్‌లి కుమార్ నాయుడులి వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గాలి వున్నప్పుడు ల్యాబ్ పరికరాల్ కొనుగోలు పై అవకతవకలు లక్షలు లో ఖర్చులు, ఇతర బిల్లులు లో అవకతవకలు జరిగాయి. దేశంలో ఎక్కడ లేని యూనివర్సిటీ లోని ఓ కాంట్రాక్టు ఉద్యోగికి 95వేల రూపాయలు జీతం ఇవ్వడంలి. నిబంధనలు కు విరుద్ధం గా యూనివర్సిటీ పరిధిలో ని 6 బిఇడి కాలేజీ ల కు బినామీ గా ఉండడం వర్సిటీలో ని పురుషులు వసతి గృహం లోని ఓ బ్లాకు కు జిం3 అనుమతి తీసుకొని బిల్లులు మంజురు చేసుకొని జిం2నిర్మించి ఆ సొమ్మును కాజేయడం జరిగిందిలి. కాబట్టి రాయలసీమ యూనివర్సిటీ లో జరిగిన అక్రమాలకు కేరఫ్ అడ్రెస్స్ గా నిలిచి న యూనివర్సిటీ వీసీ మరియు రిజిస్టర్ పైన చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రి వర్యులు టిజి .భరత్ కూడా లెటర్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిజిబి కి విచారణ చేయాలనీ సిఫార్సు లేఖ వ్రాయడం జరిగింది కావున రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన అక్రమలను బయట కు తీసి వాటి విచారణ జరిపించాలని కోరిన విద్యార్థి సంఘాల నాయకులు ను యూనివర్సిటీ నుండి తొలిగించడం ఖండిస్తూ అదేవిదంగా వారిని తిరిగి మళ్లీ యూనివర్సిటీ లోకి తీసుకోవాలని లేని పక్షం లో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రమేష్, భాను, రవి, కేశవ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

# నిరసనలో డ్యాన్సులు, గాడిదలతో హంగామా..

**ఇదా మీ రాజకీయ సంస్కారం : వైసిపి పై మంత్రి ఫరూక్ ఆగ్రహంలి**
**డీఎస్సీ పై న్యాయ విచారణకు సిద్ధం: వైసిపి ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి ఫరూక్‌లి**
**నంద్యాల అభివృద్ధి పై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలి : మంత్రి ఎన్ఎండీ ఫరూక్**




**నంద్యాల, జూన్ =13 ప్రజాజ్యోతి** నంద్యాల పట్టణ అభివృద్ధి అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే అభివృద్ధి అని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు . నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైసిపి నాయకులు డ్యాన్సులు చేస్తూ ప్రజల ముందు నవ్వులపాలవుతున్నారని విమర్శించారు.

**డీఎస్సీపై తప్పుడు ప్రచారం మానుకోండి:**
డీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని, ఇది పూర్తి పారదర్శకంగా జరిగిందని ఉన్నతాధికారులే చెబుతున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. దీనిపై న్యాయ విచారణకు కూడా తాము సిద్ధమని ప్రకటించారు. "డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసిపి నేతలు, ఒకవేళ అక్రమాలు జరగలేదని నిరూపితమైతే రాజకీయ సన్యాసం తీసుకుంటారా?" అని ఆయన సవాల్ విసిరారు.

**వైసిపి నిరసనల పై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్:**
వైసిపి నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై మంత్రి ఫరూక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఎద్దుల బండి, గాడిదల పై నిరసనలు తెలుపడం, నిరసన కార్యక్రమంలో డ్యాన్సులు, ఈలలు వేయడం వారి సంస్కారానికి నిదర్శనం అన్నారు. తప్పు చేసిన వారిని గాడిద పై ఊరేగిస్తారు, అటువంటిది వీరు గాడిదలపై నిరసన తెలపడం చూస్తుంటే వీరే తప్పు చేశారని అర్థమవుతోంది" అని ఎద్దేవా చేశారు. జగన్‌ను కుంభకర్ణుడితో పోల్చిన మంత్రి ఫరూక్ , పనిపాట లేకనే ఆయన డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు .

**మార్కెట్ యార్డ్‌కు పెరిగిన ఆదాయం:**
నంద్యాల అభివృద్ధిలో భాగంగా నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో చేపట్టిన 'ఓపెన్ ఆక్షన్' విధానంతో ఊహించని ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడించారు. కేవలం 10 దుకాణాల వేలం ద్వారానే రూ. 3.50 లక్షల ఆదాయం లభించిందని, ఈ నెల 20 న మరిన్ని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి మరింత ఆదాయం చేకూరుతుందన్నారు.

**రాజకీయాలు హుందాగా ఉండాలి:**
రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి తాను టీడీపీని నమ్ముకున్నానని, పార్టీలు మారుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని మంత్రి ఫరూక్ అన్నారు. నియోజకవర్గాల డి-లిమిటేషన్ జరిగితే వైసిపి నాయకులు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియని పరిస్థితి నెలకొందని, గత 15 ఏళ్లలో వారు చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు విమర్శలు మానుకుని, హుందాగా వ్యవహరించాలని మంత్రి ఫరూక్ సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్ స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుందూ నదిలో పురాతన 8 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహము లభ్యం



**కోవెలకుంట్ల:జూన్=13 ప్రజాజ్యోతి** మన కోవెలకుంట్ల కుందు నది యందు అతి పురాణమైన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం 8 అడుగుల ఆంజనేయ స్వామి స్వరూపము ఈరోజు కుందూ నదికి స్థానానికి వెళ్లిన ఏకలవ్య యూత్ పిల్లలు స్థానానికి వెళ్లి స్నానం చేస్తుండగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం చూసి అంతా నీటుగా శుభ్రం చేసి ఆంజనేయ స్వామి విగ్రహం పడిందని తెలిపినారు కావున ఎవరన్నా భక్తులు ఆంజనేయస్వామి విగ్రహం కొత్తగా నిర్మించుకున్న వారు ఈ ఆంజనేయ స్వామిని తీసుకొని అక్కడ ప్రతిష్ట చేసుకుంటే బాగుంటుంది కావున అందరికీ తెలియజేయడమైనది.

# కొలిమిగుండ్ల మండలంలో భారీ వర్షం



**బనగానపల్లె (కొలిమిగుండ్ల) ప్రజాజ్యోతి :జూన్=13** బనగానపల్లె నియోజకవర్గం కొలిమి గుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మండలంలోని పెట్నికోట, కొండమీదపల్లె, గొర్రిమానుపల్లె, మదనంతపురం, అంకిరెడ్డిపల్లి, చింతలాయపల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. పెట్నికోటలో మసీదు వంక ఈ సీజన్లో మొదటిసారిగా వరద నీటితో ప్రవహించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# దివ్యాంగులు, వృద్ధులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా.



**నంద్యాల:జూన్=13 ప్రజాజ్యోతి** ఈ నెల 15 వ తేదీన సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా దివ్యాంగులు, వయో వృద్ధుల పరికరాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీ. నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజ కవర్గాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు, వయో వృద్ధులకు తానున్నానన్న భరోసా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇస్తున్నారు. భారత ప్రభుత్వం ఏ డి ఐ పి పథకం క్రింద ఎ ఎల్ ఎం సి ఓ ద్వారా దివ్యాంగులకు సహాయ పరికరాలు, వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఎ పి డి ఏ ఎస్ సి ఏ సి పథకం ద్వారా సహాయక పరికరాలు ఈ నెల 15 వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణికి ఏర్పాట్లు చేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం, భారత ప్రభుత్వ ఎడీఐపి పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఎల్ ఐ ఎంసీ ఓ) సహకారంతో, అవసరమైన దివ్యాంగులకు వివిధ సహాయ పరికరాలు, ఉపకరణాలు ఉచితంగా అందించడానికి, గత ఏడాది 28-06-2025 నుండి 18-07-2025 వరకు నంద్యాల జిల్లాలోని 07 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించారు. ఆ ప్రత్యేక శిభిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలు సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా లబ్ధిదారులకు అవసరమైన పరికరాలు ఇప్పటికే నంద్యాల గోదాములకు చేరుకున్నాయి. వాటిని ఈ నెల 15 వ తేదీ నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధించిన యంత్రాంగం ఏర్పాట్లు చేసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు.

# పెద్దపీర్ల చావడిలో వందల కిలోల కుళ్లిన మాంసం పట్టుబడిన ఘటన నగర ప్రజలను కలవరపెడుతోంది.



**నంద్యాల:జూన్=13 ప్రజాజ్యోతి** తిరుపతి కి లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. కాసులకి కక్కుతి పడిన కొంత మంది కుళ్లిన మాంసం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతారు. ఈ కుళ్లిన మాంసాన్ని హోటల్స్ కి అమ్ముతూ అవి తిన్న ప్రజలు అనారోగ్యం పాలవు తున్నారు. అధికారులు తరుచూ ఇలాంటి తనికీలు చేస్తూ, కఠిన నిబంధనలు అమలు చేస్తే కొంతైనా ప్రయోజనం ఉంటుంది.ప్రజలు కోరుతున్నారు

# కాంట్రాక్ట పద్మావతి ఏజెన్సీని రద్దు చేయాలి.

ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన శానిటేషన్ వర్కర్స్ ను విధులకు తీసుకోవాలి.

వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగంలో చేర్చుకోవాలి.

పెండింగ్లో ఉన్న ఆరు నెలల జీతాలను వారి అకౌంట్లో వేయాలి.




**నంద్యాల:జూన్=13 ప్రజాజ్యోతి** ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆసుపత్రి యందు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఎఐకేయస్)జిల్లా కార్యదర్శి జి సోమన్న ఎఐటియుసి జిల్లా నాయకులు మురళి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ సుబ్బారెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు.

# నంద్యాలలో 'ఆపరేషన్ వజ్రప్రహార్'.. డ్రోన్ కెమెరాలతో పోలీసుల విస్తృత తనిఖీలు....

గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంలి

జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపియస్ గారి ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులులి



**నంద్యాల:జూన్=13ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపియస్ గారి ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఎయస్ పి కుమారి ఎం. జావళి ఐపీఎస్ గారి సూచనలతో నేటి తెల్లవారుజామున నంద్యాల పట్టణంలో 'ఆపరేషన్ వజ్రప్రహార్' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ మరియు వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్లో భాగంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, గూడ్స్ షెడ్, బొగ్గు లైన్ మొదలైన సమస్యాత్మక ప్రాంతాలను పోలీసులు పూర్తిగా జల్లెడ పట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోలీసులు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించారు. నిందితులు లేదా అనుమానితులు తప్పించుకోకుండా ఉండేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి ఆపరేషన్ను పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో తిరుగుతున్న ప్రతి ఒక్కరిని, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నంద్యాల జిల్లాలో గంజాయి మరియు ఇతర నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణా, వాడకంపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# యస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రత్యేక క్యాంపు





**నంద్యాల (శిరివెళ్ల) ప్రజాజ్యోతి :జూన్=13** శిరివెళ్ళ: ఈరోజు బిఎల్ ఓ మహేశ్వరి ఆధ్వర్యంలో శిరివెళ్ళ 93 భూత్ కు సంబంధించిన ప్రత్యేక ఓటర్ల సవరణ క్యాంపు గ్రామ వార్డు స్వర్ణ వార్డు కార్యాలయం యందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో శిరివెళ్ళ టిడిపి ఇంచార్జ్ బిసి ఫిదా హుస్సేన్, షఫిఉల్లా , బియండి రఫీ , పెసరాయి చాంద్ బాషా మరియు ఓటర్లు పాల్గొన్నారు

# ప్రాణాలతో చెలగాటమా పెచ్చులూడిన గోడల మధ్య బాలికల నివాసం

**నంద్యాల:జూన్=13 ప్రజాజ్యోతి** నంద్యాల బాలికల హాస్టల్ దుస్థితిపై ప్రశ్నిస్తున్న విద్యార్థులు,తల్లిదండ్రులు నంద్యాల పట్టణం.. పాఠశాలలు ప్రారంభమై విద్యార్థులు హాస్టళ్లకు చేరుకుంటే వారికి సురక్షితమైన వసతి కల్పించాల్సిన బాధ్యత ఎవరిది.. భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు.. విద్యార్థినుల ప్రాణాల కంటే ప్రభుత్వానికి మరేదైనా ముఖ్యమా. నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితులు చూస్తే ఇలాంటి ప్రశ్నలే ఉత్పన్నమవుతున్నాయి..!! గోడల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి..పై కప్పులు బలహీనంగా కనిపిస్తున్నాయి..గదుల్లో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి..!! ఈ నెల 12 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమవడంతో విద్యార్థినులు హాస్టల్కు చేరుకున్నప్పటికీ భవనం మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.వర్షాకాలం ప్రారంభమైన వేళ శిథిల భవనంలో విద్యార్థినులను ఉంచడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు..!! ఈ విషయంపై నంద్యాల వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ఏదైనా ప్రమాదం జరగక ముందే త్వరగా చర్యలు తీసుకొని,శిధిలావస్థలో ఉన్న బాలికల వసతి




భవనానికి మనమత్తులు చేయాలని కోరారు..!! విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొంటుందా.. లేక ఏదైనా విషాదం జరిగిన తర్వాతే చర్యలు చేపడుతుందా. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి, విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించాలని ప్రజలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు..!! విద్యార్థినుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు.. హాస్టల్ భవనం బాగుచేసేందుకు నిధులు లేవా.. లేక విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా. అంటూ విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు

# లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'





**ఎటపాక, జూన్ 13 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం జూన్ 12న ఐదేళ్ల వయస్సు పూర్తి చేసుకుని, ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడుతున్న చిన్నారులకు "గ్రాడ్యుయేషన్ డే" (అక్షరాభ్యాస ముగింపు వేడుక) కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశం లో స్థానిక నాయకులు కణితి మధు ప్రసంగించారు. మూడేళ్లు నిండిన ప్రతి బిడ్డను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని, ఇక్కడ లభించే పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని తల్లిదం డ్రులకు అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే అంగన్వాడీల ద్వారా లభించే క్రమశిక్షణ, అక్షరజ్ఞానం వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక నాయకులు కణితి మధు, సచివాలయ మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు. వీరితో పాటు లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయా కేంద్రాల ఆయాలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాలలకు వెళ్లనున్న చిన్నారులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

# అవకతవకలు లేని ఓటర్ లిస్ట్ రూపకల్పనే ధ్యేయం

## ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి

## స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)పై నియోజకవర్గస్థాయి సమావేశం





**ఆలూరు/హోళగుంద ,జూన్ 13, ప్రజా జ్యోతి న్యూస్ -**

ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గస్థాయి ముఖ్యాంశ సమావేశం ఘనంగా జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్, వివిధ సొసైటీ చైర్మన్లు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా స్థాయి ప్రతినిధులు,ఐదు మండలాల కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 15 నుండి జూలై 14 వరకు నెల రోజుల పాటు ఈ ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిరంతరాయంగా సాగనుంది. ఇందులో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలిసి సమగ్రంగా ఓటరు జాబితాను పర్యవేక్షించనున్నారు.

**అవకతవకలు లేని ఓటర్ లిస్ట్ రూపకల్పనే ధ్యేయం: వైకుంఠం జ్యోతి**

ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా రూపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో చురుగ్గా పాల్గొని కింది అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు:

**నకిలీ ఓటర్ల గుర్తింపు:** జాబితాలో ఉన్న నకిలీ ఓటల్లను పూర్తిగా తొలగించడం.

**మరణించిన వారి ఓట్ల తొలగింపు:** చనిపోయిన వారి పేర్లను ఓటర్ లిస్ట్ నుండి తీసివేయడం.

**కొత్త ఓటర్ల నమోదు:** అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు కల్పించడం.

**మార్పులు చేర్పులు:** తప్పులు ఉన్న ఓటర్ కార్డులను సరిచేయడం.



**కరపత్రాల పంపిణీ**

ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గానూ, క్లస్టర్, యూనిట్ మరియు బూత్ స్థాయి బాధ్యులకు వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా అధికారిక కరపత్రాలను (పాంప్లెట్స్) పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైనదని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఈ సమగ్ర ఓటరు పర్యవేక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి పిలుపునిచ్చారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసీపీ అసత్య ప్రచారాలు

## వెన్నుపోటు దినోత్సవం కాదు... ప్రజా సంక్షేమ దినోత్సవం"

## వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదు

## వైసీపీ విమర్శలకు వైకుంఠం జ్యోతి  కౌంటర్....!



**ఆలూరు/హోళగుంద, జూన్ 13, ప్రజా జ్యోతి న్యూస్–** గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ నాయకులకు వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదనీ,కూటమి ప్రభుత్వం జరుపుకుంటోంది వెన్నుపోటు దినోత్సవం కాదు... ప్రజా సంక్షేమ దినోత్సవం" అని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు స్పష్టమైన తీర్పుతో వైసీపీని ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా, ఆ పార్టీ నాయకులు ఇంకా తమ తప్పులను తెలుసుకోకుండా రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.

**గాడిలో పడ్డ రాష్ట్ర అభివృద్ధి -- నేరుగా ప్రజలకే లబ్ధిః**

గత ఐదేళ్లలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని వైకుంఠం జ్యోతి స్పష్టం చేశారు. నూతన ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు ప్రజల్లో నూతన భరోసాను నింపాయన్నారు.

**ప్రజా సంక్షేమ కార్యక్రమాలు:**

పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్ల' పునరుద్ధరణ, భవన నిర్మాణ రంగానికి ఊతమిచ్చే 'ఉచిత ఇసుక విధానం', భూ వివాదాలకు చెక్ పెట్టేలా 'డీఫామ్ భూ రికార్డుల సంస్కరణలు' వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు.

**పెంచిన పెన్షన్లు:**

సామాజిక పెన్షన్లను రూ.4,000లకు పెంచి, లబ్ధిదారుల ఇంటివద్దకే సంక్షేమాన్ని చేరవేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల మనసులను గెలుచుకుందన్నారు.

**సూపర్ సిక్స్ హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం...!**

మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో ముందుకు సాగుతోందని జ్యోతి తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన...తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి పథకాల ద్వారా మహిళా సాధికారత,యువశక్తి ప్రోత్సాహకాల ద్వారా నిరుద్యోగ యువతకు భరోసా,రైతులకు పెట్టుబడి సాయం వంటి కీలక హామీలన్నింటినీ నెరవేర్చడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**నవ్యాంధ్ర భవిష్యత్తుకు బలమైన పునాదిః**

వైసీపీ పాలనలో భయపడి వెనక్కి వెళ్లిపోయిన పెట్టుబడులను సంపాదించడమే కాకుండా, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను ఆకర్షించే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

**ముఖ్యమైన మౌలిక వసతుల కల్పన:**

రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడం, అమరావతి రాజధాని నిర్మాణాన్ని పునఃప్రారంభించడం, రహదారుల అభివృద్ధి మరియు పారిశ్రామిక ప్రగతి ద్వారా నవ్యాంధ్ర భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బలమైన పునాది వేస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా, వైద్య రంగాల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు.

**అసత్య ప్రచారాలను తిప్పికొడతాం...!**

ప్రజల తిరస్కారాన్ని జీర్ణించుకోలేకనే వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని... అయితే తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల అభివృద్ధి, రాష్ట్ర పురోగతినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని వైకుంఠం జ్యోతి అన్నారు. విమర్శలు చేసేవారికి రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారానే ప్రజలు సరైన సమాధానం చెబుతారని ఆలూరు తెదేపా ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఈ సందర్భంగా హెచ్చరించారు.

**సిఎం చంద్రబాబు అభివృద్ధి రాజకీయాల ముందు వైసిపి ప్రతిపక్ష రాజకీయాలు నిలబడలేవుః**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు.రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపిస్తూ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు.ప్రజలు స్పష్టమైన తీర్పుతో వైసీపీని తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చా రని, ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్య క్రమాలు చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు అసహనంతో విమ ర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన వైసీపీకి, ప్రస్తుతం జరుగుతున్న అభి వృద్ధి జీర్ణించుకోవడం లేదన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప వైసీపీకి మరో రాజకీయ అజెండా లేదని ఎద్దేవా చేశారు.అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, రహదారుల అభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందన్నారు.ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వైఎస్సార్‌సీపీ రోజు రోజుకు ప్రజలకు దూరమ వుతోందని, అభివృద్ధిని అడ్డుకోవాలనే రాజకీయాల తో ఆ పార్టీ మరింత పాతాళానికి పడిపోతుందని శ్రీమతి వైకుంఠం జ్యోతి గారు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉన్నంత కాలం అభి వృద్ధి యాత్రను ఎవరూ ఆపలేరని వైకుంఠం జ్యోతి స్పష్టం చేశారు.

# తమ్మినేని సీతారాం రాజకీయ జీవితం ఒక తెరిచిన పుస్తకం

– భూ ఆక్రమణ ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమే. – తమ్మినేనిని రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారం చేస్తున్న కొందరు వ్యక్తులు.– రాజకీయ ప్రస్థానంలో తమ్మినేని ముద్ర చెరగనిది. – ఆయన వ్యక్తిత్వం ,ప్రజాసేవ ,నిబద్ధత గురించి ప్రజలే చెబుతారు. – తమ్మినేని ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించేది లేదు. – నిజాలు ఎప్పటికైనా వెలుగులోకి వస్తాయి.– యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్





**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లా రాజకీయ చరిత్రలో మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం రాజకీయ జీవితం ఒక తెరిచిన పుస్తకమని, ఆయనపై చేస్తున్న భూ ఆక్రమణ ఆరోపణలు పూర్తిగా రాజకీయ కుట్రలో భాగమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ పేర్కొన్నారు.శనివారం ఆముదాలవలసలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.శ్రీకాకుళం-- పాలకొండ ప్రధాన రహదారిపై ఆముదాలవలస పట్టణ నడిబొడ్డున తమ కుటుంబం సుమారు 25 సంవత్సరాల క్రితమే స్థిర నివాసాన్ని నిర్మించుకుందని తెలిపారు.అనంతరం అదే ప్రాంతంలో సుమారు 15 సంవత్సరాల క్రితం విద్యా సంస్థను స్థాపించినట్లు వివరించారు.తమ కళాశాల వెనుక భాగంలో సుమారు 40 సెంట్ల స్థలాన్ని తమ్మినేని సీతారాం చట్టబద్ధంగా కొనుగోలు చేశారని,ఆ స్థలంలోని కొంత భాగంలో కళాశాలకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. అయితే మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమికి సబ్ డివిజన్ జరగకపోవడం వల్ల కొంత గందరగోళ పరిస్థితి నెలకొన్నదని దీనిని ఆసరాగా చేసుకుని తమ కుటుంబంపై భూ ఆక్రమణ ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. తమ్మినేని సీతారాం వంటి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు వ్యక్తులు కావాలనే అసత్య ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక శాఖలను నిర్వహించిన మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా,పలు మంత్రివర్గ ఉపసంఘాలలో సభ్యునిగా,ప్రజానాయకుడిగా ఆయన సేవలు అందించారని గుర్తుచేశారు.మచ్చలేని రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా తమ్మినేని సీతారాంను జిల్లా ప్రజలు గుర్తిస్తారని పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లి అడిగినా ఆయన వ్యక్తిత్వం, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత గురించి ప్రజలే చెబుతారని అన్నారు.భూ ఆక్రమణల పేరుతో ఆరోపణలు చేస్తున్న వ్యక్తులు గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర స్థాయి అధి, కారులకు ఫిర్యాదులు చేశారని,ఆ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు భూమి హద్దులు, భూ రికార్డులు, పత్రాలను పరిశీలించి ఉన్నతా ధికారులకు నివేదికలు సమ ర్పించిన విష యాన్ని గుర్తు చేశారు. ఇటీవల జరుగుతున్న భూముల రీ–సర్వే ప్రక్రియలో తమకు సంబంధించిన భూమి హద్దులను అధికారులకు తెలియ జేసేం దుకు వెళ్లిన సమయంలో, సబ్ డివిజన్ కాని మొత్తం భూ మిపైనే కొందరు వ్యక్తులు హక్కులు ప్రకటిస్తూ వివాదానికి తెరలేపారని ఆరోపించారు.ఇదే సమయంలో కొందరు వ్యక్తిగత మరియు రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కావాలనే వివాదాన్ని రాజేశారని పేర్కొన్నారు.మీడియా ముసుగులో రాజకీయ కుట్రలకు పాల్పడుతున్న స్వార్థపరులకు తగిన సమయంలో తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. నాలుగు గోడల మధ్య కొందరు వ్యక్తులు రచించిన రాజకీయ నాటకంలో భాగంగానే ఈ భూ వివాదాన్ని సృష్టించి,తమ్మినేని సీతారాం ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.ఇలాంటి అసత్య ప్రచారాలు,వ్యక్తిగత దూషణలు ప్రజల ముందు నిలవవని,నిజాలు ఎప్పటికైనా వెలుగులోకి వస్తాయని తమ్మినేని చిరంజీవి నాగ్ స్పష్టం చేశారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు స్కూళ్లలో ఉచిత విద్య అమలుకు ఉత్తర్వులు

**ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి మేరకు  ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ఓ ఆనంద్**

గుంతకల్లు జూన్ 13 (ప్రజాజ్యోతి): అనంతపురం జిల్లా లో జర్నలిస్టుల పీలల్లలకు ప్రయివేటు పాఠశాల లో ఉచిత విద్య అమలయ్యేలా కలెక్టర్ ఓ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే పోరాటాల ఫలితంగా కొన్నేళ్లుగా జిల్లా లో ఈ విధానం అమల్లో ఉంది. 2026–27 విద్యా సంవత్సరం లోను ఈ విధానాన్ని అమలు  చేయాలని ఇటీవలే ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్ కు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే విజ్ఞప్తి ని పరిగణలోకి తీసుకున్న జిల్లా యంత్రాంగం తాజా గా ఈ ఏడాది లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయం పై యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు పయ్యావుల ప్రవీణ్, మహమ్మద్ ఆయుఫ్ సహా యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# బ్రాహ్మణ కార్పొరేషన్ను దేవాదాయ



**డోన్ (ప్రజా జ్యోతి న్యూస్) జూన్ 13,** శాఖలోకి మార్చినందుకు హర్షం వ్యక్తం చేసిన నంద్యాల జిల్లా డోన్ వేదమాత బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నంద్యాల శంకర్ శర్మ.

# ఘనంగా కాటసాని కాత్యాయని

**పుట్టిన రోజు వేడుకలు**



**బనగానపల్లె :జూన్=13 ప్రజాజ్యోతి** బనగానపల్లె పట్టణం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారి స్వగృహం నందు వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి గారి కుమార్తె కాటసాని కాత్యాయని రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. ఈ కార్యక్రమంలో అత్తార్ జాహీద్ హుస్సేన్,అబ్దుల్ ఫైజ్,పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి,అంబటి రవిరెడ్డి, మమ్మదా,అక్బర్ భాషా,మెకానిక్ అబెద్,కటిక కరీం,గద్దం అమీర్, అత్తర్ అఖిల్, కటికవాని కుంట మోహన్ రెడ్డి,వైఎస్సార్సీపీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

**సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ.**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 13 (ప్రజా జ్యోతి)** దోమకాటు ప్రమాదకరమని, పరిసరాల శుభ్రతతోనే దోమలు నివారణ అవుతాయని సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. గోపవరం మండల పరిధిలోని డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకులం స్కూలులో దోమల నివారణకు ఏసియన్ స్ప్రేయింగ్ జరిగింది.  ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ, వేసవి సెలవులలో తమ పరిధిలోనున్న ప్రతి హాస్టల్లో స్ప్రేయింగ్ చేయడం జరిగింది. పరిసరాలను శుభ్రంగా నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. దోమలను లార్వాదశలోనే నివారించాలన్నారు .గ్రామ, పట్టణాలలో లార్వా, ఫీవర్, డయేరియా పై ప్రతిరోజు వైద్య సిబ్బంది, తాము సర్వే నిర్వహిస్తున్నమన్నారు. అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని గాంధీనగర్ సూపర్వైజర్ శివరామిరెడ్డి అన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత భోజనానికి ముందు హ్యాండ్ వాష్ చేయిస్తున్నామన్నారు. విద్యార్థినులలో ముఖద్వారా క్యాన్సర్ రాకుండా ,వారికి హెచ్ పీవీలను వేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్  భానుమతి, హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్ధన్ రావు, వెంకటసుబ్బయ్య, స్కూల్ సిబ్బంది, వైద్య సిబ్బందిలో పాల్గొన్నారు.

# సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.





**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆర్జీయూకేటీ లో ప్రవేశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో కుమారి మహేశ్వరి పాత్రో నూజివీడు క్యాంపస్‌కు, మాస్టర్ కంటుభుక్త కార్తీక్ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌కు ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులకు మాత్రమే ఆర్జీయూకేటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆర్జీయూకేటీలకు ఎంపికైన విద్యార్థులు తమ ఆనందాన్ని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పంచుకొని, తమ విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# స్పందించిన జెనసేన నాయకులు.





**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలం ఆర్ ఎల్ పురం గ్రామ సచివాలయం కాలువ పాడుఅవడం తో ప్రజలు చాలా ఇబ్బందిగా ఉంది అని కూటమి నాయకులు జనసేన పార్టీ ఉమ బర్రి కి తెలియజేయడం జరిగింది.వెంటనే స్పందిస్తూ అధికారులతో వెళ్ళి ఆయన కాలువ పనులు దగ్గర ఉండి బాగుచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఉమ బర్రి మరియు పంచాయతీ సెక్రటరీ కె రాము తదితరులు పలుగున్నారు.

# రక్షణ సైన్య సంఘము ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో - ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



**బాపట్ల జూన్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పిట్టలవానిపాలెం మండలం అల్లూరు నత్తలువారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షణ సైన్య సంఘము ఆలయ ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆలయ నిర్వాహకులు, సంఘ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలను నిర్వహించి, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు యువతలో మంచి విలువలను పెంపొందించడంతో పాటు గ్రామాభివృద్ధికి కూడా దోహద పడతాయని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రక్షణ సైన్య సంఘము ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన భక్తులు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం దేవుని ఆశీస్సులు కోరారు. కార్యక్రమ ప్రాంగణం భక్తజనాలతో కిటకిటలాడగా, ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, రక్షణ సైన్య సంఘము సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోలిపాకలో మహిళల, రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం





**కూనవరం, జూన్ 13 (ప్రజాజ్యోతి):** కూనవరం మండలం పోలిపాక గ్రామంలో శనివారం మహిళల భద్రత, రోడ్డు భద్రత అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. కన్నపరాజు, కూనవరం ఎస్సై బి. రామకృష్ణ పాల్గొని గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. మహిళలపై వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు వంటి ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన సేవలు, అత్యవసర సహాయ నంబర్ల గురించి వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి ప్రయాణించరాదని అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై పోలీసు అధికారుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

# రోడ్డు మార్గాన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

**వరదల సమయంలో 24 గిరిజన గ్రామాలు చీకట్లోనే**

**అధికారుల నిర్లక్ష్యంపై సీపీఎం ఆగ్రహం**

**స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**



**కూనవరం, జూన్ 13 (ప్రజాజ్యోతి):** కూనవరం మండలంలో వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాయం సీతారామయ్య తీవ్రంగా విమర్శించారు. చిన్నార్కూర్ (జిన్నెలగూడెం)--బురదగూడెం మీదుగా బొజ్జరాయి వరకు ఉన్న సుమారు 24 గిరిజన గ్రామాలు ప్రతి ఏడాది వరదల సమయంలో విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆర్ అండ్ బీ రోడ్డు మార్గం ద్వారా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, అలాగే ఆర్కూరు--రేపాక--అభీచర్ల రహదారి వెంట విద్యుత్ లైన్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళనలు నిర్వహించినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే రహదారి మార్గంలో విద్యుత్ లైన్ ఇవ్వకుండా, అవకాశం లేని ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా విద్యుత్ లైన్లు మంజూరు చేస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. వరదల సమయంలో విద్యుత్, తాగునీరు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాబోయే వరదలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం, విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ఆర్కూరు--రేపాక--అభీచర్ల రోడ్డు మార్గంలో విద్యుత్ లైన్ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మార్గాన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయకపోతే మండల ప్రజలను సమీకరించి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం కూనవరం మండల కమిటీ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, పొడియం రామారావు, బాబు బొర్రయ్య, మడకం నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ, ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పోడూరు మండలంలో గ్రామ గ్రామాన మొక్కలు నాటిన బీజేపీ నాయకులు





**పాలకొల్లు.ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూన్ 13.**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పరిపాలన పురస్కరించుకొని మండల బీజేపీ అధ్యక్షులు చింతపల్లి రమేష్ శెట్టి ఆధ్వర్యంలో పోడూరు మండలం లోని 16 గ్రామాలలో బీజేపీ శ్రేణులతో సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోను మొక్కలు నాటారు. వాటి పర్యవేక్షణ బాధ్యతను సమీపంలోని ఆసక్తి కలిగిన వారికి అప్పగించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోడూరు మండలం ఇన్ ఛార్జ్ జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ 12 సంవత్సరాల సుపరిపాలన లో కేంద్రప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. సుమారు 41 కిలోమీటర్లు సాగిన సాగిన ర్యాలీలో గ్రామ గ్రామాన మొక్కలు నాటడంతో విశేష స్పందన లభించింది. అనంతరం మండల అధ్యక్షుడు రమేష్ కూటమి నాయకులకు మరియు మొక్కలు కి సహకారం అందించిన జక్కంపూడి కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆకుమర్తి పెద్దిరాజు, మేడపాటి ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, కౌరు నాగబాబు, కనుమూరి గోపాల కృష్ణంరాజు, కడలి లక్ష్మీనారాయణ,వేంద్ర సురేష్, అనుసూరి వెంకట శెట్టి, దొమ్మేటి రామాంజనేయులు ,గణేష్ వల్లూరు ప్రసాద్,అనుసూరి వీరం చిట్టి, కొండేటి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసమేబలంగా!..

**శాంతిభద్రతలే ధ్యేయంగా!..**

**ఎస్సై ఎస్.డి సాధిక్!..**



**వి.ఆర్.పురం,జూన్13(ప్రజాజ్యోతిప్రతినిధి)** ప్రజలవిశ్వాసమే బలంగా శాంతిభద్రతలే ధ్యేయంగా మహిళల పట్ల ఎవ్వరైనా అసభ్యంగాప్రవర్తించినా నోరుజారి దుర్భాషలాడినా, కఠినచ ర్యలు, తీసుకుంటామని ఎస్సై ఎస్.డి.సాధిక్, హెచ్చరిం చారు. శనివారం వరరామచంద్రాపురం,మండలం వి.ఆర్. పురం గ్రామంలోమహిళలకు సంబంధించి అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై ఎస్.డి. సాధిక్, మాట్లా డుతూ,పోలీస్ అంటేభయంఅనే అభిప్రాయాన్ని తొలి గించి, పోలీస్ అంటే నమ్మకం, భరోసా,అనే భావన పెంపొం దించేందుకు మీ ముందుకు వచ్చామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలభాగస్వామ్యం అత్యంత కీలకమనే విస్తృతంగా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు.ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ మీఅభిప్రాయాలను తెలుసు కునేం దుకు మీదగ్గరకు వచ్చామని చెప్పా రు.పోలీస్ అంటే క్రమశిక్షణ, బాధ్యతా యుత విధి నిర్వాహణకు అధిక ప్రాధాన్యత ఇస్తు న్నామని వివరించారు. ప్రజల భద్రతే ధ్యేయంగా నేరాల కుతావులేకుండా, చేయడ మేధ్యేయం అనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.ద్విచక్ర వాహనదా రులకు సంబంధించి సమాజం లో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలు, వాటిని ఏవిధం గా ఎదుర్కోవాలి వాళ్లకున్న చట్టాలు గురించి తెలిపామన్నారు. ద్విచక్ర వాహనదారులు, వాహనాలు నడుపున మయంలో తీసుకో వలసిన జాగ్రత్తలు హెల్మెట్ వాడకం వాహనాలకు సంబంధించిన అన్నిడాక్యు మెంట్స్ గురించి వివరించడం జరిగిందని తెలిపారు. అదేవిధం గా మహి ళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవ ర్తించినా, దుర్భాషలా డినా, కఠినమై నచర్య లు తీసుకుంటామని, హెచ్చరించారు.



# ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయడం తగదు

- టెట్ రద్దుకై చట్ట సవరణకు కృషి చేయాలి.
- పిఆర్సీ అమలు, సిపిఎస్ రద్దుపై స్పందించాలి.
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 13 (ప్రజా జ్యోతి)** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు విమర్శించారు. శనివారం కడపలోని యుటిఎఫ్ భవన్ లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లయినా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లయిందని, అయినప్పటికీ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారం చేపట్టిన ఆరు మాసాలలోగా చెల్లిస్తామన్న ఆర్థిక బకాయిలు, రెండేళ్లయినా పూర్తి చెల్లింపులకు నోచుకోలేదన్నారు. కేవలం 9,500 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లించి, ఉద్యోగుల బకాయిలన్నింటిని చెల్లించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇంకా 30 వేల కోట్ల పైబడిన బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొద్ది మేరకు ఆర్థిక బకాయిల్ని చెల్లించినప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు చేపట్టకపోవడం తగదన్నారు. ఆర్థిక బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు. పాలక వర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారపక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చిన కూటమి పెద్దలు గద్దెనెక్కగానే ఉద్యోగుల సమస్యలను విస్మరించడం ఏంటని ప్రశ్నించారు. సకాలంలో డిఏలు చెల్లించకపోతే ఉద్యోగ, ఉపా ధ్యాయులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో ప్రశ్నించిన కూటమి పెద్దలు నేడు నాలుగు డిఏ లను పెండింగ్లో ఉంచడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్నారు. ఉద్యోగ, ఉపాధ్యా యులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తా మన్న కూటమి నేతలు ఆ వైపుగా ఒక్క అడుగు కూడా వేయక పోవడం దుర్మార్గమన్నారు. కరోనా మహమ్మరితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టక పోవడం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఉన్న వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులు లేవన్నారు. ప్రభుత్వం జారీచేసిన హెల్త్ కార్డులు చెల్లని రూకలా ఉన్నాయన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు ఆదేశాలపై పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ తీర రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ తిరుపతి

-- గుంతకల్లు సెక్షన్‌లో విస్తృత తనిఖీలు



**గుంతకల్లు జూన్ 13 (ప్రజా జ్యోతి):** దక్షిణ తీర రైల్వే (ఎస్‌సీఓఆర్) జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ శనివారం గుంతకల్లు డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు, తిరుపతి రైల్వే స్టేషన్‌తో పాటు తిరుపతి-- గుంతకల్లు రైల్వే సెక్షన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిం చారు. కొత్తగా ఏర్పాటైన దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పడిన అనంతరం ఈ సెక్షన్‌లో ఆయన నిర్వహించి న తొలి తనిఖీ ఇదే. జోన్ వ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాలు మరియు కొన సాగుతున్న ప్రాజెక్టుల పురోగ తిని సమీక్షించడం ఈ తనిఖీ ప్రధాన ఉద్దేశ్యం. తిరుపతి రైల్వే స్టేషన్‌లో జనరల్ మేనేజర్ స్టేషన్ పునర్వికాస ప్రాజెక్టు పురోగతిని సమీక్షిం చారు. సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్టులు, ఎస్కలేట ర్లు, ప్లాట్‌ఫారాలు, కాన్‌కోర్స్ ప్రాంతం మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలతో పాటు మౌలిక వసతుల పనులను పరిశీలించారు. నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడిన ఆయన, పనుల ను అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా గుంతకల్లు డివిజన్ అధికారులు కొనసా గుతున్న ప్రాజెక్టులు, అభివృ ద్ధి కార్యక్రమాలు, నిర్వహణ విజయాలు మరియు భవిష్య త్ ప్రణాళికలపై సమగ్ర ప్రజెం టేషన్ అందించారు. తనిఖీల లో భాగంగా సందీప్ మాథుర్ రాజంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి సర్క్యులేటింగ్ ఏరియా, వేచివుండే హాల్, పార్కింగ్ స్థలం మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యా ల అభివృద్ధి పనులను సమీ క్షించారు. అనంతరం కడప రైల్వే స్టేషన్‌లో సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు మరి యు ప్రయాణికుల సౌకర్యా లను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతు న్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. పనుల నాణ్యతను అంచనా వేసి, అన్ని ప్రాజెక్టులను నాణ్యత తో పాటు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ తాడిపత్రి నుండి గుత్తి వరకు విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించి ట్రాక్ పరిస్థి తులు, భద్రతా అంశాలు మరియు కొనసాగుతున్న పనులను సమీక్షించారు. గుత్తి రైల్వే స్టేషన్‌లో యార్డ్ రీమోడ లింగ్ పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గుత్తి నుండి గుంతకల్లు వరకు రైల్వే మౌలిక వసతులను కూడా విండో ట్రైలింగ్ తనిఖీ ద్వారా పరిశీలించారు. ఈ తనిఖీల సందర్భంగా ప్రధాన చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రధాన చీఫ్ సిగ్నల్ మరియు టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రధాన చీఫ్ ఆపరేష న్స్ మేనేజర్ వినీత్ కుమార్, దక్షిణ తీర రైల్వే ముఖ్య పరిపాలనా అధికారి అంకుష్ గుప్తా మరియు గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు.

# శబరి నదిని గుల్లచేస్తున్న ఇసుక మాఫియా!..

అనుమతులు లేకుండా పక్క రాష్ట్రాలకు ఇసుక ట్రిప్పర్ల ద్వారా ఇసుకఅక్రమరవాణా!..
?గిరిజన చట్టాలను కాలరాస్తే సహించేది లేదు!..
ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం!..
చోద్యం చూస్తున్న



**వి.ఆర్.పురం,జూన్,13(ప్రజాజ్యోతి ప్రతినిది)** ఏజెన్సీ ప్రాంతాల లో గిరిజనుల రక్షణకోసం రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను, చట్టాలను భేఖాతరుచేస్తూ, పోలవరం జిల్లా చింతూరుడివిజన్ పరిధిలోని కూనవరం మండలం, శబరి, నదితీరంనుండి "రాత్రి "పగలు" తేడాలేకుండా ఇసుక ట్రిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను పక్కరాష్ట్రాలకు తరలిస్తున్న ఇసుక మాఫియా దోపిడీపై ఆదివాసి గిరిజన సంఘం తీవ్రఆగ్రహంవ్యక్తంచేస్తోంది. ఎటువంటిఅధికారికఅనుమతులు, మైనింగ్ "వే"-బిల్లులు లేకుండా, స్థానిక అధికారుల కళ్ళముం దే ఈదందా సాగుతుంటే.. యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు,జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్,ప్రశ్నించారు.?భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీప్రాంతాల్లోని మైనర్ ఖనిజాలపై సర్వాధికారాలు స్థానిక గిరిజన గ్రామసభలకే ఉంటాయి. 1996 పెసా చట్టం,సమతా జడ్జిమెంట్ మరియు ఏజెన్సీ ప్రాంత భూగణుల నిబంధనల ప్రకారం గిరిజనగ్రామసభ అనుమతి లేకుండా ఇసుకను ఇంచ్ కూడా కదపడానికి వీల్లేదని, అలాంటిది ఇంత జరుగుతున్నా అధికారులు ఏంచేస్తున్నారని?వారు ప్రశ్నించారు.కూనవరంలో గ్రామసభల తీర్మానాలు లేవు, పర్యావరణ అనుమతులులేవు. సరిహద్దులుదాటించి పక్క రాష్ట్రాలకు ఇసుకను తరలించడానికి ఏచట్టం అనుమతి ఇచ్చిందో జిల్లా మైనింగ్ అధికారులు సమాధానం చెప్పాలి. డిమాండ్ చేశారు.గిరిజన జీవోలను,చట్టాలను తుంగలోతొక్కి సాగుతున్న ఈ అక్రమదోపిడీ ముమ్మా టికీ రాజ్యాంగ ఉల్లంఘనేనని ఈబహి రంగ దోపిడీపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేస్తోందని వారు స్పష్టం చేశారు.ఈఅక్రమ తవ్వకా లపై తక్షణమే విచారణకు ఆదేశిం చి,"కూనవరం" శబరి తీరంలో జరుగు తున్న క్వారీలను నిలిపివేయాలని సూచిం చారు.ఏజెన్సీ పరిధిలో గిరిజన హక్కుల రక్షణకు బాధ్యత వహించాల్సిన ఐ.టి. డి.ఏ, ఈ దోపిడీపై ఎందుకు నిఘా పెట్టడం లేదు? గిరిజన సంపద తరలిపో తుంటే తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.సరిహద్దులు దాటుతున్న అక్రమ ఇసుక ట్రిప్పర్లను అడ్డుకోవడానికి ప్రత్యేక పోలీస్ పికెట్లను ఏర్పాటు చేయాలని, రూట్లలో ఉన్న చెక్‌పోస్టుల సీ.సీ.టీ.వీ, ఫుటేజ్‌లను తనిఖీ చేసి, అక్రమ వాహనాలను సీజ్ చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వ ఖజానాకు, గిరిజననిధులకు గండి కొడుతూ,"వే-బిల్లులు" లేకుండా నడుస్తున్న ఈమాఫియాపై భారీజరిమానాలు విధించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దు చెక్‌పోస్టులు దాటుతుంటే యంత్రాంగం ఏం చేస్తోంది. కూన వరం దాటి పక్క రాష్ట్రాల సరిహద్దుల వరకు ఇసుక ట్రిప్పర్లు వెళ్తుంటే,మార్గమధ్యంలో ఉన్న రెవెన్యూ, మైనింగ్, పోలీస్ యంత్రాంగాలు ఏం చేస్తున్నాయి? మాఫియాతో చేతులు కలిపి గిరిజన సంపదను దోచిపెడుతున్న కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోతే,మేము ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని,న్యాయస్థానాలను,నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయిస్తాం మని వివరించారు.అంతేకాకుండా, పర్యావరణవిధ్వంసం మరియు గిరిజన చట్టాల ఉల్లంఘన కింద నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, మరియు లోకాయుక్తను ఆశ్రయించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులను కూడా ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చి న్యాయపోరాటం చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం స్పష్టం చేస్తోందని చెప్పారు.?ఇకనైనా అధికారులు స్పందించి,చట్టాన్ని కాపాడి, గిరిజన సంపద దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

# వెన్నుపోటుకు రెండేళ్ల నిరసనలపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బిర్రు గుర్రప్ప విమర్శలు




**జమ్మలమడుగు, ప్రజా జ్యోతి న్యూస్** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బిర్రు గుర్రప్ప రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" అనే పేరుతో జరుగుతున్న నిరసనలను తీవ్రంగా ఖండించారు. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత తల్లి, చెల్లికి ఆస్తి పంపకాల విషయంలో వెన్నుపోటు పొడిచారని వారి నుంచే ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకుడు ఇలాంటి నిరసనలకు పిలుపు నివ్వడం హాస్యాస్పదమని వ్యాఖ్యానిం చారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తల్లి వందనం, స్త్రీ శక్తి, అన్న క్యాంటీన్, అన్నదాత సుఖీభవ, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అలాగే 5 లక్షల ఇళ్ల పంపిణీ, నూతన రహదారుల నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు, అమరావతి రాజధాని అభివృద్ధి, మెగా డీఎస్సీ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అదేవిధంగా గూగుల్ టి సి ఎస్ వంటి ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా పేదరిక నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసనలు చేపట్టడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నిరసనలకు బదులుగా "బాబాయి గొడ్డలిపోటుకు ఏడేళ్లు", "సొంత తల్లి, చెల్లికి వెన్ను పోటు" అంశాలపై నిరసనలు చేపట్టాలని ఆయన సూచించారు.

# ఎటపాక సీఐ వి.కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన పలు సంఘాల నాయకులు

సమస్యలు ఉంటే ఎల్లవేళలా సంప్రదించవచ్చని భరోసా




**ఎటపాక, జూన్ 13 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ వి. కృష్ణను శనివారం పలు ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆటో జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అలవల రాజా పెరియార్, భద్రాద్రి ఫిజికల్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఊటుకూరి సాయిరాం ఆధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్‌లో వారిని కలిసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వి. కృష్ణ మాట్లాడుతూ సమాజంలో స్వయం ఉపాధి ద్వారా ఆత్మగౌరవంతో జీవిస్తున్న దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు. దివ్యాంగులపై ఎలాంటి దాడులు, వివక్ష, అవహేళన జరిగినా సహించబోమని స్పష్టం చేశారు.దివ్యాంగుల హక్కులకు భంగం కలిగించినా, వారిపై దాడులకు పాల్పడినా దివ్యాంగుల హక్కుల చట్టం--2016 సెక్షన్ 92(ఎ) ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, రక్షణ అవసరమైనా నేరుగా తమను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు లక్ష్మయ్య, నాని, పెల్లి శ్రీనివాస్, మనోహర్, గద్దం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం.




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో 99,251 /- రూపాయిలు,ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్ ల పాతపట్నం నియోజకవర్గం కేంద్రానికి చెందిన మజ్జి తులసమ్మ గారికి 60,217/-, విశ్వనాథ్ మోడీ గారికి 39,034/- రూపాయిలు ముఖ్యమంత్రి సహాయనిధి అందించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ ధన్యవాదములు తెలిపిన బాధితకుటుంబసభ్యులు పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయుకుల ద్వారా స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు గారి దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సిఫారసు చేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆ కుటుంబాలాకి 99,251/- వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా నిధులు అందిస్తున్నారు. అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

--మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని అవగాహన.

--శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని విజ్ఞప్తి.

--ఎస్సై అబ్దుల్ నస్సిర్ హుసైన్.



**మోతిగూడెం ప్రజాజ్యోతి జూన్ 13 :** మోతుగూడెం పంచాయతీ పరిధిలోని ఇంతులూరువాగు గ్రామంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతూరు ఎస్సై అబ్దుల్ నస్సిర్ హుసైన్ గ్రామస్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణపై అవగాహన కల్పించారు.గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని పిలుపునిచ్చారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఎవరికీ చెప్పరాదన్నారు. మోసపూరిత ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.

# ఉప్పుటూరులో ఆయుష్ వైద్యశాలకు కొత్త భవనం దిశగా అడుగులు

తక్షణమే అనువైన ప్రదేశానికి

తరలించాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం



**బాపట్ల జూన్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ఆయుష్ వైద్యశాల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం స్వర్ణ గ్రామ సచివాలయంలోని పరిమిత స్థలంలో కొనసాగుతున్న వైద్యశాలను పరిశీలించిన ఆయన, గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.శనివారం ఉప్పుటూరులో పర్యటించిన కలెక్టర్‌కు స్థానికులు ఆయుష్ వైద్యశాలకు సొంత భవనం అవసరాన్ని వివరించారు. గతంలో శిథిలావస్థ కారణంగా తొలగించిన భవనం స్థలంలోనే తిరిగి వైద్యశాల నిర్మించాలని కోరారు. దీంతో ఆ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు.ప్రస్తుతం వైద్యశాల నడుస్తున్న చిన్న గది వల్ల రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, తక్షణమే అనువైన ప్రదేశానికి వైద్యశాలను మార్చే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఏ. హరికుమార్, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి. చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం ఆంధ్ర – ఒడిస్సా బోర్డర్ చెక్పోస్టులో శనివారం సాయంత్రం సీఐ ఎన్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ వలన కలిగే ఉపయోగాలు గురించి వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుతుందని ఆయన తెలిపారు. పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు ఉండాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించని యెడల జరిమానా విధించబడుతుందని వాహనదారులకు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిఠాపురం పశువుల సంతలో 201వ వారానికి చేరిన 'డొక్కా సీతమ్మ అన్నసదుపాయ కేంద్రం' ఉచిత అన్నదానం






**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)** పిఠాపురం: నిరుపేదల ఆకలి తీర్చడమే పరమోన్నత ధర్మమని నమ్మి, సమాజ సేవలో జనసేన పార్టీ మరో మైలురాయిని దాటింది. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు పిఠాపురం పశువుల సంతలో నిర్వహిస్తున్న "డొక్కా సీతమ్మ అన్నసదుపాయ కేంద్రం" ఉచిత అన్నదాన కార్యక్రమం విజయవంతంగా 201వ వారంలోకి అడుగుపెట్టింది. జనసేన పార్టీ గొల్లప్రోలు మండల అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. 201వ వారం లోకి ప్రవేశించిన సందర్భంగా పశువుల సంతకు వచ్చిన రైతులు, పశు బేరగాళ్ళు, సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు మరియు స్థానిక నిరుపేదలకు ప్రేమతో, ఆప్యాయతతో కూడిన ఉచిత మధ్యాహ్న భోజన వసతిని కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాటా ్లడుతూ.. "ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అన్నిటికంటే గొప్ప దానం. సమాజ సేవే పరమోన్నత ధర్మమనే భావనతో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఈ కేంద్రాన్ని నడుపుతున్నాం" అని తెలిపారు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా (201 వారాలు) ఒక్క వారం కూడా విరామం లేకుండా ఈ అన్నదానాన్ని కొనసాగించడం పట్ల స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నిరంతర యజ్ఞంలో భాగస్వాములవుతూ, కార్యక్రమ విజయవంతానికి అహర్నిశలు సహకరిస్తున్న ప్రతి జనసేన నాయకునికి, కార్యకర్తకు మరియు సేవాభావం కలిగిన మిత్రులకు జ్యోతుల శ్రీనివాస్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సైబర్ నేరాలు, గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలి

పురుషోత్తపట్నంలో అవగాహన సదస్సు గుర్తుతెలియని కాల్స్, లింకుల పట్ల జాగ్రత్త అవసరం

గంజాయి విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు మహిళల రక్షణకు పోలీస్ శాఖ అండ

హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలు నివారించాలి ఎటపాక సీఐ వి. కృష్ణ, ఎస్సై జి. అప్పలరాజులు



ఎటపాక, జూన్ 13 (ప్రజాజ్యోతి): సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఎటపాక సీఐ వి. కృష్ణ పిలుపునిచ్చారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో శనివారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రత, మహిళల రక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వి. కృష్ణ, ఎస్సై జి. అప్పలరాజులు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడి డబ్బులు కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయి విక్రయాలు లేదా రవాణా జరిగినట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చ రించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దని ఎస్సై అప్పలరాజు తెలి పారు. మహిళలు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే వాహ నదారులు ట్రాఫిక్ నిబం ధనలు పాటించి, తప్పని సరి గా హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించ వచ్చన్నారు. కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతిని ధులు, మహిళలు, యువకులు, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై విద్వేష రాజకీయాలు సరికాదు..

**వైసీపీకి 2024లో ప్రజలే గుణపాఠం చెప్పారు, 11 స్థానాలకు పరిమితం చేశారు...!!!**

**రోజా గుర్తుపెట్టుకో నీది ఐరన్ లెగ్ ఎక్కడికి వెళ్తే అక్కడ వాళ్ళ నాశనం అయిపోతారు**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్**




**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)** ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం పిఠాపురం, జూన్ 13 : వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా దెబ్బతిందని, గ్రామీణ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ విమర్శించారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రహదారులు శిథిలావస్థకు చేరాయని, అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసిన వారికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రహదారులు, మౌలిక సదుపాయాలు, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వైసీపీ పాలనలో అవినీతి, భూకబ్జాలు, మద్యం విధానంలో అక్రమాలు, ప్రజలపై ఆర్థిక భారం వంటి అనేక అంశాలను ప్రజలు గమనించారని, అందుకే 2024 ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం చేశారు రోజా గుర్తుపెట్టుకో నువ్వు ఐరన్ లెగ్ ఎక్కడికి వెళ్తే అక్కడ వాళ్ళ నాశనం అయిపోతారు పిల్లికి బిక్షం వెయ్యరు మీరు మా అధినేతను విమర్శించే స్థాయి మీది కాదు ఆయన అన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయ డం సమంజసం కాదన్నా రు. రాష్ట్రంలో శాంతి, సామ రస్య వాతావరణాన్ని దెబ్బతీ సేందుకు కుల, మతాల పేరు తో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను జనసేన--టీడీపీ--బీజేపీ కూటమి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాజకీయ లబ్ధి కోసం సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు సహించరని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన పాలనకు ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని, రానున్న రోజుల్లో కూడా ప్రజలే తుది నిర్ణేతలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసమే తమ బలమని, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని తెలిపారు. 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రజల ముందుంచి మరోసారి ఆశీర్వాదం కోరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ , డీసీసీ బ్యాంక్ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు , అలాగే కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అందిస్తున్న సహకారానికి పెంకే జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలనతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో ముందంజలో నిలపడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. :::

# యోగతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సాధ్యం

- కలెక్టర్ వినోద్ కుమార్



**బాపట్ల జూన్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజలంతా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొంది ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సూచించారు. పర్చూరు మండలం అద్దంకిలోని నాంచారమ్మ దేవస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా యోగాసనాలు వేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ప్రజలతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు త్రికోణాసనం, వజ్రాసనం, భుజంగాసనం, పద్మాసనం, ప్రాణాయామం తదితర యోగాసనాల్లో పాల్గొని యోగ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు.యోగ ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని కాపాడే సాధనంగా యోగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.యోగతో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం పెరుగుతాయని బాపట్ల ఆర్డీవో ఏ. హరికుమార్ తెలిపారు. భారతీయ సంస్కృతిలో యోగకు విశిష్ట స్థానం ఉందని పర్చూరు ప్రత్యేక అధికారి, ఉప కలెక్టర్ లవన్న పేర్కొన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ అన్నారు.ఈ కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి. చంద్రశేఖర్, తహసీల్దార్ బ్రహ్మయ్యతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# నిధులు ఉన్న పాతకోట గ్రామ
# అడవి తల్లి బాట రహదారికికష్టాలు




**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారి.**

**తూతు మంత్రంగపనులు.**

**పని ప్రారంభించినేటికి రెండు సంవత్సరాలు. అనంతగిరి మండలం. జూన్ 13.** ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. అనంతగిరి పంచాయతీ పరిధి పాతకోట. రేగం. తేనెపుట్టు. తలారిపాడు తదితర గ్రామాలకు అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా రహదారి నిర్మాణం కొరకుకోట్లాది రూపాయల నిధులు మంజూరై పనులు ప్రారంభించి నేటికీ రెండు సంవత్సరాల గడుస్తున్న రహదారు పనులు నత్తనడకగా సాగుతు అడవి తల్లి బాట రహదారుకి కష్టాలు వచ్చాయితూతూ మంత్రంగా జరుగుతున్న పనుల్లో నాణ్యత లేదు రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ రహదారు పనులు పూర్తి కాకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆవేదన చెందుతున్నారు. రాకరాక మంజూరైన రహదారిని కూడా పూర్తి చేయకపోవడం విచారకరమని. అనంతగిరి మండల ట్రైబుల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారి నిర్లక్ష్యంముమ్మాటికి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రేగం గ్రామానికి తేనెపుట్టు గ్రామానికి రహదారికిమధ్యలో అమర్చిన సిమెంట్ గొట్టాలు ఎటువంటి సిమెంట్ కాంక్రీట్ వేయకుండా మట్టి కప్పి అమర్చి ఉన్నారని దీనివల్ల ఉపయోగం లేదని చిన్నపాటి వర్షం వచ్చిన మొత్తం రహదారి కొట్టుకొని పోతుందని గ్రామస్తులు చెప్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలను నీరుగారిచే ప్రయత్నం ఇంజనీరింగ్ శాఖ అధికారులు చేస్తున్నట్లుగా కనిపిస్తుందని స్థానిక మండల అధికారి నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం కారణంగా రహదారి పనులు పూర్తి కావడం లేదని ఆరోపిస్తున్నారు. రహదారీపనుల విషయంపైమండల ఇంజనీరింగ్ అధికారికి ప్రజా జ్యోతి దినపత్రిక వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాలేదని అందుకే పనులు జరగడం లేదని ప్రభుత్వ పనితీరును కించపరిచే విధంగా వివరణ ఇచ్చారు.

# మహిళల పై జరుగుతున్న మోసాలపట్ల అప్రమత్తం గా ఉండాలి






**సి. ఐ. గోపాల కృష్ణ**

**చింతూరు జూన్ 13 ప్రజాజ్యోతి** మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మహిళల భద్రత గూర్చి అవగాహన సదస్సును చట్టి గ్రామం లో నిర్వహించారు. పోలీసువు న్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఏ.ఎస్.పి హేమంత్ కుమార్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారంచట్టి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చొని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ మొబైల్ వాడకం పెరిగిన తర్వాత మహిళలను లొంగదీసుకోవటానికి, అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయని వారిపట్ల అప్రమత్తమై పోలీసులకు 112, శక్తి యాప్ ద్వారా వెంటనే సమాచారం ఇచ్చి తమను తాము రక్షించుకోవాలని వివరించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, కుయిగూరు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ, యస్ ఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికమాసంలో మాస శివరాత్రి సందర్భంగా
# 33 వత్తుల దీపాలతో శివ పార్వతులకు హారతి




**చాగలమర్రి , జూన్ 13(ప్రజాజ్యోతి న్యూస్) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి పట్టణములో శ్రీ కోదండరామాలయంలో అధికమాసంలో మాస శివరాత్రి సందర్భంగా సందర్భంగా ఈశ్వరునికి వత్తులు, డ్రై ఫ్రూట్ పదార్థాలతో , నైవేద్యాలతో 33 దీపాలతో హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకులు పుల్లేటికుర్తి రాధాకృష్ణ ఆధ్వర్యములో ఈశ్వరునికి అభిషేకం , బిల్వపత్రార్చన జరిపించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సునితాలక్ష్మి , తొమ్మండ్రు భవాని , భవాని దేవి , బచ్చు సువర్ణ , ఈదుల సుమలత , తొమ్మండ్రు సుభాషిణి , సుధ , కూరపాటి ఇందిరాదేవి , మహిళా భక్తులు , కూరపాటి లక్ష్మీనారాయణ , ఈదుల ఎల్లారెడ్డి , ప్రింటింగ్ ప్రెస్ వెంకట క్రిష్ణ, తోమండ్రు మల్లిఖార్జున , వంకదార లక్ష్మణబాబు , తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆన్లైన్ మోసలా భద్రతపై అవగహన సదస్సు

**--ఓటీపీలు,వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వొద్దని ఎస్సై హెచ్చరిక.**

**--సందేహాస్పద లింకులు క్లిక్ చేయవద్దని ఎస్సై సూచనలు.**

సైబర్ మోసాలకు గురైతే వెంటనే **1930**కు కాల్ చేయాలి:ఎస్ఐ చరణ్ నాయక్.

మోతిగూడెం ప్రజాజ్యోతి జూన్ 13 : పోలవరం జిల్లా బొడ్డగండి గ్రామపంచాయతీ పరిధిలోని మంగంపాడు గ్రామంలో డొంకరాయి పోలీసులు మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చరణ్ నాయక్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫోటోల మార్ఫింగ్, ఆర్థిక మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసులు ఎప్పుడూ ఓటీపీ వివరాలు అడగరని, వ్యక్తిగత ఫోటోలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని లేదా సమీప పోలీస స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. తొలి గంటలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. అవగాహనతో ఉంటే సైబర్ నేరాలను నివారించవచ్చని పేర్కొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఘన విజయం: గొల్లప్రోలు మండలంలో 17 ట్రిపుల్ ఐటీ సీట్లు!

**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** పదో తరగతి ఫలితాలలో గొల్లప్రోలు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఏకంగా 17 ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి మండల కీర్తిని చాటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంతటి భారీ సంఖ్యలో సీట్లు సాధించడంపై విద్యాశాఖ అధికారులు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలల వారీగా సాధించిన సీట్ల వివరాలు:**

**జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల (గొల్లప్రోలు): 07 సీట్లు**

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (దుర్గాడ): 03 సీట్లు**

**జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (గొల్లప్రోలు): 02 సీట్లు**

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వన్నెపూడి): 01 సీటు**

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కొడవలి): 01 సీటు**

**క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థులు:**

మండల విద్యార్థులు సాధించిన మొత్తం 17 సీట్లలో క్యాంపస్‌ల వారీగా ఎంపికైన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు అత్యధికంగా 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ) క్యాంపస్‌లో నలుగురు, నూజివీడు క్యాంపస్‌లో ఇద్దరు, ఒంగోలు క్యాంపస్‌లో ఒక విద్యార్థి సీటు సాధించారు.

**అధికారుల అభినందనలు:**

విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధతతో, ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను తీర్చిదిద్దడం వల్లే ఈ అసాధారణ విజయం సాధ్యమైందని విద్యా వర్గాలు కొనియాడాయి. ప్రభుత్వ పాఠశాలల నుండి ఇంతపెద్ద సంఖ్యలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ, మండల విద్యాశాఖాధికారులు. వెన్నా శ్రీనివాస్ మరియు బి. వెంకట శివప్రసాద్‌లు ప్రత్యేక సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయ బృందాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు.

# గొల్లప్రోలు మార్కండేయపురంలో ముమ్మరంగా 'ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్'



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు(ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు, జూన్ 13:పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలోని మార్కండేయపురంలో శనివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

**కాలువల పునరుద్ధరణ -- పిచ్చిమొక్కల తొలగింపు:**

ఈ డ్రైవ్‌లో భాగంగా వీధుల్లోని డ్రైనేజీలకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను, తుప్పలను సిబ్బంది పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా, కాలువల ద్వారా సాఫీగా ముందుకు సాగిపోయేలా డ్రైనుల్లో పేరుకుపోయిన సిల్ట్ (మట్టి, వ్యర్థాలు)ను పూర్తిగా తొలగిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

**3 వార్డుల్లో పనులు ప్రారంభం:**

ప్రస్తుతం మున్సిపాలిటీలోని 2వ వార్డు, 5వ వార్డు, మరియు 9వ వార్డులలో ఈ పారిశుధ్య పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. మిగిలిన వార్డుల్లోనూ నిరంతరాయంగా ఈ డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి:**

పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కమిషనర్ శ్రీనివాసులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై లేదా డ్రైనేజీ కాలువల్లో పడేయవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా వేరు చేసి, తమ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు (స్వచ్ఛ ఆటోలకు) మాత్రమే అందించాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యత: ఎస్పీ ఉమామహేశ్వర్

**బాపట్ల జూన్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం నిర్వహించే పోలీస్ సహచార్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొని వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు, ఆరోగ్య కారణాలతో బదిలీలు, ఇతర శాఖాపరమైన అంశాలపై ఎస్పీకి వినతులు అందజేశారు. సిబ్బంది సమస్యలను విన్న ఎస్పీ, సాధ్యమైన అంశాలపై వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, డీపీవో సిబ్బందిని ఆదేశించారు. ప్రతి నెల రెండో శనివారం పోలీస్ సహచార్ కార్యక్రమం, ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్పీ సంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సిబ్బంది నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చని చెప్పారు. అలాగే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# రెండేళ్లలో మారిన పోలవరం రూపురేఖలు

-మొదటిపేజీ తరువాయి

రూపురేఖలు మారిపోయాయ్. లక్ష్యం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయ్. ఏడాదిలోగా ఈ మహాయజ్ఞం పూర్తి కావాలంటే ఏం చేయాలి? సర్కార్ ముందున్న సవాళ్లేంటి? అనేది ఇప్పుడు చూద్దాం. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి. వైఎస్సార్సీపీ రివర్స్ గేర్‌తో వినాశనానికి గురైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం సంక్షోభాల చీకట్లను చీల్చుకుంటూ సరికొత్త వెలుగులతో సాకారం దిశగా అడుగులు వేస్తోంది. డయాఫ్రం వాల్‌ను కేవలం 14 నెలల్లోనే రికార్డు సమయంలో నిర్మించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ప్రధాన డ్యాం వద్ద అగాథాలు పూడ్చివేశారు.



2027 మహా పుష్కరాల కంటే ముందే ఈ మహా యజ్ఞాన్ని పూర్తి చేసి జాతికి అంకింత ఇవ్వాలనే సంకల్పంతో పనులు చేస్తున్నారు. అయితే అసలు పోలవరం ఇంత ఆలస్యం కావడానికి కారణాలేంటి? వైఎస్సార్సీపీ చేసిన పాపమేంటి? కూటమి సర్కార్ సాధించిన విజయాలేంటి? భవిష్యత్తులో చేయాల్సిన పనులేంటి? అనే వాటిపై సమగ్ర విశ్లేషణ ఇది.

### అగాథాలు సాంకేతికతతో పూడ్చివేత

డయాఫ్రం వాల్ డ్యామేజ్ ప్రధాన డ్యాం వద్ద సీపేజ్ ఇదీ వైఎస్సార్సీపీ మార్క్ వినాశనం రెండేళ్ల క్రితం అంటే 2024 జూన్‌లో పోలవరం పరిస్థితి మహా దారుణం. గత జగన్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టుకు గుండె లాంటి డయాఫ్రం వాల్ తీవ్రంగా ధ్వంసమైంది. 2020లోనే ఈ కట్టడం దెబ్బతిన్నా ఏడాది పాటు దాన్ని గుర్తించలేని చేతకానితనంలో నాటి ప్రభుత్వం, పాలకులు ఉన్నారు. దీనికి తోడు ప్రధాన డ్యాం నిర్మించాల్సిన చోట గోదావరిని తలపించేలా సీపేజీ సమస్య ముంచెత్తింది. దీంతో భారీ అగాథాలు ఏర్పడ్డాయి. ఎడమ కాలువ పనులు ఐదేళ్లలో ఒక్క శాతం కూడా ముందుకు కదల్లేదు. పునరావసం అస్సలు పట్టించుకోలేదు. ఇలా పోలవరం పాలిట శాపంగా మారింది వైఎస్సార్సీపీ పాలన.

### కేవలం 14 నెలల్లోనే కొత్త డి-వాల్ పూర్తి

జెట్ స్పీడ్‌లో పనులు రెండేళ్లలో మారిన రూపురేఖలు ఇదీ కూటమి సర్కార్ కమిట్‌మెంట్ కూటమి ప్రభుత్వం రాగానే పోలవరానికి పట్టిన గ్రహణాన్ని వీడగొట్టింది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం అథారిటీలతో సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ విదేశీ నిపుణుల బృందాన్ని రంగంలోకి దించింది. విదేశీ నిపుణులు ఏడుసార్లు ప్రాజెక్టును సందర్శించారు. గత ప్రభుత్వం ధ్వంసం చేసిన పాత డయాఫ్రం వాల్ స్థానంలో కూటమి సర్కార్ కేవలం 14 నెలల్లోనే కొత్త డి-వాల్ పూర్తి చేసింది.

365 ప్యానెళ్లు, 13 వందల 72.60 మీటర్ల పొడవునా ఈ పటిష్టమైన వాల్ నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం నుంచి వచ్చే సీపేజీని అరికట్టేందుకు విదేశీ నిపుణుల సూచనలతో బట్రస్ డ్యాంను నిర్మించారు. ప్రధాన డ్యాం ప్రాంతాల్లో ఏర్పడిన అగాథాలను వైబ్రో కాంపాక్షన్ సాంకేతికతతో విజయవంతంగా పూడ్చివేసి నేలను పటిష్టం చేశారు. డ్యాం గ్యాప్ -3 కాంక్రీటు నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ఎత్తు పెంచే పనులను వేగవంతం చేశారు. మొత్తం 53.32 మీటర్ల ఎత్తుకు నిర్మించాల్సి ఉండగా గ్యాప్ -1 ఇప్పటికే 33 మీటర్లు, గ్యాప్ -2 ను 20 మీటర్ల ఎత్తుకు నిర్మించారు.

### 80 శాతానికి పైగా పనులు పూర్తి

గడచిన రెండేళ్లలోనే ప్రాజెక్టుపై 6 వేల 33 కోట్లు ఖర్చు చేశారు. గత వైఎస్సార్సీపీ సర్కార్ వదిలేసిన ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించి 80 శాతానికి పైగా పూర్తి చేశారు. అటు కుడి, ఎడమ కాలువ అనుసంధాన పనులు కూడా 90 శాతానికి చేరుకున్నాయి. పాత ప్రభుత్వంలో అటకెక్కిన పునరావాస పనులను చురుగ్గా చేపట్టారు. కేవలం రెండేళ్లలోనే నిర్వాసితుల కోసం 2 వేల 237 కోట్లు చెల్లించారు. గతంలో పనులు ఆపేసిన గుత్తదారులకు కొత్త ధరలకు టెండర్లు కేటాయించి నిర్వాసితుల కాలనీల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు.

### లక్ష్యం సాధించాలంటే ఏడాదిలో ఏం చేయాలి?

2027 జూన్ నాటికి మొత్తం డ్యాం ం53.32 మీటర్ల ఎత్తుతో పూర్తి చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యం. గ్యాప్-1 పొడవు 584 మీటర్లు. 33 మీటర్ల ఎత్తువరకు దీని నిర్మాణం పూర్తయింది. గ్యాప్-2 ప్రధాన డ్యాం 1,750 మీటర్లు. ఇది 20 మీటర్ల ఎత్తు వరకు పూర్తయింది. నిర్మాణంలో ప్రతి లేయర్‌లో నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ పూర్తి చేయాలి. ఆరు నెలలకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంది. జనవరి నుంచి అవసరమైన మెటీరియల్ సేకరిస్తున్నారు. పనుల వేగం పెంచాలి. వారం వారం లక్ష్యం కచ్చితంగా అమలయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

పునరావాసంలో మొత్తం 38 వేల 060 కుటుంబాలను తరలించాలి. ఇంతవరకు 17 వేల 261 కుటుంబాలు తరలించారు. మరో 20 వేల 799 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇందుకు 4 వేల 395 కోట్లు కావాలి. కాలనీలు నిర్మించాలి. 6 వేల 950 ఎకరాలు సేకరించి ఇవ్వాలి. సకాలంలో ఇవి పూర్తి చేయాలంటే ఇంకా వేగం పెంచాల్సి ఉంది. వైఎస్సార్సీపీ సర్కార్‌లో ధ్వంసమైన గైడ్‌బండ్ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాలి. స్పిల్ వే వైపు వచ్చే ప్రవాహం వల్ల సుడిగుండాలు ఏర్పడకుండా ఇది రక్షణగా నిలుస్తుంది.

అప్రోచ్ ఛానల్‌లో ఇంకా 38.5 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తొలగించాల్సిన పనులు మొదలు పెట్టాలి. డి వాల్ నిర్మాణం సందర్భంగా ప్యానళ్లు నదీగర్భంలో దింపే విషయంలో మొదట్లో కొన్ని సమస్యలు తలెత్తినా అవి పరిష్కారమైనట్లు విదేశీ నిపుణులు ప్రకటించారు. డి వాల్‌లో బ్లీడింగ్ కనిపించిన ప్యానళ్ల మధ్య సంబంధంపై గుత్తేదారు కంపెనీ నుంచి నివేదిక తీసుకోవాలని సిఫార్సు చేశారు. అన్ని ప్యానళ్ల నిలువు, భ్రమణం కొలవడానికి బావర్ నివేదికల్లో ఉన్న త్రీడీ డేటాను సమీక్షించాలన్నారు. లోపాలు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలని విదేశీ నిపుణులు సూచించారు.

డి వాల్ పైభాగాన్ని కొంత మేర తొలగించి ప్రధాన డ్యాం నిర్మించాలి. పోలవరం అధికారులు డి వాల్‌ను 400 మీటర్ల మేర ం18.5 మీటర్ల వద్ద కోత పెట్టిన అంశం చర్చనీయాంశమైంది. విదేశీ నిపుణుల బృందం ం19 నుంచి కోత పెట్టి పనులు చేయాలని సిఫార్సు చేసింది.

# ఉత్తరాంధ్రలో లోకేష్ టీమ్

**విజయనగర :** ఏపీ రాజకీయాల్లో ఉత్తరాంధ్ర కీలకం. ఉత్తరాంధ్రలో ఏ పార్టీ మెజారిటీ సీట్లు దక్కించుకుంటే అదే పార్టీ అధికారంలోకి రాగలదు. ప్రధానంగా ఉత్తరాంధ్రలో బిసి వర్గాలు అధికం. మత్స్యకారులు కూడా ఉన్నారు. గిరిజనులు కూడా నివసిస్తున్నారు. అయితే ప్రతి రాజకీయ పార్టీ ఉత్తరాంధ్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా అదే పనిలో ఉంది. ఉత్తరాంధ్రలో యువనాయకత్వానికి ప్రోత్సాహం అందించడం ద్వారా.. వచ్చే ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించాలని చూస్తోంది. ఆపై తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి.. మరో నాలుగు దశాబ్దాల పాటు అవసరమైన నాయకత్వాన్ని అందించాలని భావిస్తోంది. అందులో భాగమే చింతకాయల విజయ్ కు రాజ్యసభ పదవి. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ టీం ఉత్తరాంధ్రలో రంగంలోకి దిగిందన్నమాట. 2024 ఎన్నికల తరువాత తీసుకున్న నిర్ణయాలు చూస్తే టిడిపి యువతకు పెద్దపీట వేసినట్టేకచ్చితంగా తెలుగుదేశం పార్టీలో యువనేతల్లో లోకేష్ తర్వాత ఎవరు? అంటే ముందుగా గుర్తొచ్చేది కింజరాపు రామ్మోహన్ నాయుడు. పార్టీలో కూడా విపరీతమైన ఇమేజ్ సొంతం చేసుకున్నారు రామ్మోహన్ నాయుడు. కేవలం యువనేతలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో శ్రీకాకుళం పార్లమెంటు స్థానం నుంచి మూడోసారి గెలిచిన రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించారు. కీలకమైన పౌర విమానయాన శాఖను అందించారు. మరోవైపు మొన్నటి ఎన్నికల్లో గజపతినగరం నుంచి యువకుడైన కొండపల్లి శ్రీనివాస్ కు అవకాశం ఇచ్చారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపించారు. ఉత్తరాంధ్రలో బలోపేతం కావడంతో పాటు టిడిపికి భవిష్యత్తు నాయకత్వం



అందించేందుకుగాను ఈ నిర్ణయాలు అన్నట్టు ఉన్నాయి. వీరు మాత్రమే కాదు దాదాపు నేతల వారసులందరికీ ఛాన్స్ అందించింది టిడిపిఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఐదు వరకు పార్లమెంటు సీట్లు కూడా ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో 32 అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకుంది టిడిపి కూటమి. నాలుగు పార్లమెంటు స్థానాలను దక్కించుకుంది. అయితే ఇదే దూకుడు కొనసాగాలి అంటే యువనాయకత్వం రావాలి అన్న ఆలోచనలో టిడిపి ఉంది. అందుకే కింజరాపు రామ్మోహన్ నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, చింతకాయల విజయ్ వంటివారికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. పైగా వీరంతా లోకేష్ టీమ్ గా ముద్ర ఉంది. ఆముద్రను బలంగా చాటుకోవాలని భావిస్తోంది. గతంలో చంద్రబాబు నాయుడుకు వలయంగా ఉండేవారు కింజరాపు ఎర్రన్నాయుడు, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు లాంటివారు. ఇప్పుడు వారు వారసులు రంగంలోకి వచ్చారు లోకేష్ కోసం. మొత్తానికైతే చాప కింద నీరులా లోకేష్ టీం విస్తరిస్తోంది ఉత్తరాంధ్రలో..

# మారిన నియోజకవర్గాల లెక్కేంటీ

**విజయవాడ :** గత ఎన్నికల సమయంలో కొందరు నాయకులు పోటీ చేసిన నియోజకవర్గాల్లో వారు ఓడిపోయారు. అయితే.. ఆ తర్వాత పలువురు నేతలు.. పార్టీ మారారు. అలాంటి నియోజకవర్గాల్లో ఇప్పటికీ వైసీపీ రాజకీయాలు ఒకదారికి రాకపోవడం గమనార్హం. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని సరిదిద్దాలన్న సూచనలు వస్తున్నా.. ఇప్పటికీ.. పార్టీ అధిష్టానం పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటనేది వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. జగ్గయ్యపేట.. ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సామినేని ఉదయభాను.. గత ఎన్నికల తర్వాత జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇక్కడ వైసీపీ తరఫున పెద్దగా పట్టించుకునే నాయకులు కనిపించడం లేదు. ఇది పార్టీకి.. స్థానిక కేడర్‌కు కూడా ఇబ్బందిగానే మారింది. తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం



నుంచి పోటీ చేసిన గొల్లపల్లి సూర్యారావు కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గాన్ని వదిలేశారు. ఇక్కడ కూడా పార్టీ ఇబ్బందులు పడుతోంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూడా వైసీపీకి ఎదురు గాలి వీస్తోంది. మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. మేకతోటి సుచరిత గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత.. ఆమె.. తిరిగి ప్రత్తిపాడుకు వెళ్లిపోయారు. కానీ, దూకుడుగా వ్యవహరించలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. పైగా.. ఆమె పార్టీ మార్పుపై కొన్నాళ్ల కిందటే చర్చ వచ్చినా.. మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. విజయవాడ సెంట్రల్‌లోనూ.. ఇదే పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చి ఇక్కడ చక్రం తిప్పిన అప్పటి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్.. తిరిగి తన నియోజకవర్గానికి చేరిపోయారు. దీంతో సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ టాక్ ఎక్కడా వినిపించడం లేదు. ఎవరూ ముందుకు రావడం లేదు. పార్టీ మాటే వినిపించడం లేదు. ఇలా పదుల సంఖ్యలో నియోజకవర్గాలు వైసీపీకి ఇబ్బందిగా ఉన్నాయి. దీంతో ఏదైనా చేయాలని.. నాయకులను నియమించాలని నేతలు కోరుతున్నారు.

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

-మొదటిపేజీ తరువాయి

కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా...

-మొదటిపేజీ తరువాయి

బృందాలను రంగంలోకి దించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.

### తుని చిన్నారి అదృశ్యం కేసులో ఆధారం అనుకున్న శునకం మృతి

చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బాలిక ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు కీలక ఆధారంగా నిలుస్తుందని భావించిన కుటుంబం పెంపుడు కుక్క మరణించింది. దీంతో ఈ కేసు దర్యాప్తులో పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో నివసిస్తున్న సుంకర గణేష్, భవానీ దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన విషయం తెలిసిందే. పాపతో పాటు వారి పెంపుడు కుక్క కూడా కనిపించకుండా పోయింది. అయితే, కొన్ని రోజుల తర్వాత ఆ శునకం మాత్రమే తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో బాలిక జాడ కోసం పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి దాన్ని వదిలిపెట్టారు. జీపీఎస్ అమర్చిన తర్వాత ఆ శునకం సుమారు 80 నిమిషాల పాటు 8 కిలోమీటర్ల మేర సమీప పొలాలు, అటవీ ప్రాంతంలో తిరిగి, మళ్లీ ఇంటికి చేరుకుంది. కానీ, ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్లే అలసటతో అది మరణించి ఉంటుందని భావిస్తున్నారు.

ఇప్పటికే పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు డ్రోన్ల సహాయంతో విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. ఇప్పుడు కీలక ఆధారం అనుకున్న శునకం కూడా మరణించడంతో ఈ కేసు మరింత మిస్టరీగా మారింది. పోలీసులు కిడ్నాప్ సహా ఇతర కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## అందరికీ నీతులు చెప్పే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉంది

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన 'ధర్మస్థల' పవిత్రతను దెబ్బతీసేందుకు ప్రకాశ్ రాజ్ ప్రయత్నించారని, ఇదొక దిగ్భ్రాంతికరమైన, అవమానకరమైన చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు.

ధర్మస్థలానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేసేందుకు నటుడు ప్రకాశ్ రాజ్ కేరళ నుంచి ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేశారని 'చిన్నయ్య' అనే వ్యక్తి ఆరోపించిన విషయాన్ని విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తావించారు. తరచూ ఇతరులకు నైతికత, ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు కచ్చితంగా బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు రుజువైతే, ప్రకాశ్ రాజ్ ఎంత పెద్ద నటుడైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. సెలబ్రిటీ హోదా అనేది చట్టపరమైన చర్యల నుంచి రక్షణ కవచం కాకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు.

## దేవినేని, వంగవీటి కు కలిసి రాని కాలం

**విజయవాడ :** విజయవాడలో ఒకప్పుడు దేవినేని కుటుంబం రాజకీయాలకు పెట్టింది పేరు. దేవినేని రాజశేఖర్ జీవించి ఉన్న సమయంలో ఆయన నగర రాజకీయాలను తన గుప్పిట్లో పెట్టుకునేవారు. ఆయన ఏ పార్టీలో ఉన్నప్పటికీ బెజవాడలో ఆయనదే పై చేయి అయ్యేది. కొన్ని దశాబ్దాల కాలం పాటు దేవినేని కుటుంబం బెజవాడ రాజకీయాలను శాసించిందనే చెప్పాలి. కానీ దేవినేని నెహ్రూ మరణించిన తర్వాత మాత్రం ఆ కుటుంబానికి రాజకీయంగా కలిసి రావడం లేదు. ఆయన కుమారుడు దేవినేని అవినాష్ ఎన్నిసార్లు పోటీ చేసినా ఇప్పటి వరకూ ఎన్నికల్లో విజయం సాధించలేదు. నెహ్రూ కు గెలుపులు పలకరిస్తే అవినాష్ ను ఓటములు కౌగలించుకుంటున్నాయి. నిజానికి దేవినేని అవినాష్ తెలుగుదేశం పార్టీ, వైసీపీ అంటూ పార్టీలు మార్చారు. ఏ పార్టీలో ఉన్నప్పటికీ దేవినేని అవినాష్ కష్టపడతారన్న పేరుంది. నిత్యం ప్రజల్లో ఉండేందుకే ప్రయత్నిస్తారంటారు. కానీ ఆయనకు పొలిటికల్ గా లక్కు కలిసి రావడం లేదు. తన తండ్రి నెహ్రూ జీవించి ఉన్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత దేవినేని అవినాష్ టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో గుడివాడలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం తిరిగి వైసీపీలోకి మారారు. 2024 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి మరోసారి అపజయాన్ని మూటగట్టుకున్నారు. దేవినేని అవినాష్ ఈసారి కూడా నియోజకవర్గం మార్చబోతున్నారు. దేవినేని నెహ్రూ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దేవినేని అవినాష్ ఇప్పటి వరకూ చట్టసభల్లో అడుగు పెట్టలేదు. దీంతో తన తండ్రి గతంలో ప్రాతినిధ్యం వహించిన కంకిపాడు (అప్పట్లో) నియోజకవర్గం, ఇప్పుడు పెనమలూరు నియోజకవర్గంపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలిసింది. తూర్పు నియోజకవర్గం కంటే తనకు పెనమలూరు నియోజకవర్గం బెటర్ అని దేవినేని అవినాష్ భావిస్తున్నారు. పెనమలూరు అయితే తన గెలుపు గ్యారంటీ అన్న నమ్మకంతో ఉన్నా? పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. తన తండ్రి దేవినేని నెహ్రూ గతంలో కంకిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో అక్కడ తనకు బలమైన ఓటు బ్యాంకు ఉందనినమ్ముతున్నారు. మరి ఈసారైనా గెలుపు దేవినేని అవినాష్ ను పలకరిస్తుందా? లేదా? అన్నది చూడాలి.

బెజవాడ రాజకీయాలను వంగవీటి కుటుంబాన్ని వేరు చేసి చూడలేం. వంగవీటి రంగాకు ఇప్పటికీ విజయవాడ నగరంలో అభిమానులు, ప్రత్యేక అభిమానులు ఉన్నారు. కానీ ఆయన మరణానంతరం మాత్రం వంగవీటి కుటుంబానికి రాజకీయాలు అచ్చిరావడం లేదు. రంగా లెగసీని వారసులు అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఒకరకంగా రంగా అభిమానులకు ఆవేదన కలిగించే విషయం. వంగవీటి రంగా హత్య తర్వాత ఆ కుటుంబంలో ఎవరికీ రాజకీయాలు పెద్దగా కలిసి వచ్చినట్లు కన్పించడం లేదు. ఒకసారి రంగా సతీమణి రత్నకుమారి, మరొకసారి కుమారుడు వంగవీటి రాధా ఎమ్మెల్యేగా గెలవడం తప్పించి తర్వాత గెలుపు దక్కలేదు. ఎన్ని పార్టీలు మారి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దశాబ్దాల కాలం నుంచి రాజకీయ పదవులకు వంగవీటి కుటుంబం దూరంగానే ఉంటుంది. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వంగవీటి రాధాకు నాడు టిక్కెట్ కూడా దొరకలేదు.

## సంపాదకీయం

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇఈల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి. డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా? నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా?కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి?తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# ఆక్రమిత కశ్మీర్ కల్లోలం



ఎప్పుడూ జమ్మూ, కశ్మీర్ గురించి అంతర్జాతీయ వేదికలపై గంభీరోపన్యాసాలిస్తూ, మానవ హక్కుల చాంపియన్‌గా తనను తాను చిత్రించుకునే పాకిస్తాన్ గత కొన్ని రోజులుగా ఆక్రమిత కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సైన్యం కాల్పుల్లో 30 మంది మరణించారంటున్నా, వాస్తవ సంఖ్య అంతకుమించి ఉంటుందన్నది స్థానికులు చెప్పే మాట. మరో 200 మంది గాయపడ్డారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ఈసారి సాగిన నిరసన ప్రదర్శన సాధారణమైంది కాదు. ముజఫరాబాద్ ప్రదర్శనలో అన్నివర్గాలకూ చెందిన లక్షన్నరమంది పాల్గొన్నారు. మతం పేరు చెప్పి, గతం పేరుచెప్పి ఎల్లకాలమూ జనాన్ని మభ్యపెట్టడం సాధ్యంకాదని పాక్ పాలకులకు ఈ నిరసనలు తెలియజెప్పాయి. తమ ప్రాంత నదుల్లో మంగళ డ్యామ్‌వంటి ప్రాజెక్టులు నిర్మించి,ఇక్కడ ఉత్పత్తయ్యే జలవిద్యుత్‌ను పంజాబ్ తదితర ప్రాంతాలకు తరలించుకుపోతూ, స్థానికులకు అరకొర సదుపాయాలు కల్పించటం విషయంలో రెండు దశాబ్దాల క్రితమే అసంతృప్తి పెల్లుబికింది. కానీ సంఘటితం కాకపోవటంవల్ల చల్లారిపోయాయి. 2023లో రావల్‌కోట్, ముజఫరాబాద్, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై కమిటీలు ఏర్పడి ఉద్యమించాయి. ప్రజల మౌలికాహారమైన గోధుమ పిండి ధర పెంచడాన్నిప్రశ్నించాయి. వీటిని ప్రభుత్వం బేఖాతరు చేసిన ఫలితంగా ఆ కమిటీ లు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్)గా ఒక్కటయ్యాయి. ఆనకట్టల కారణంగా పలువురు నిర్వాసితులవుతున్నా, వలసపోతున్నా పట్టించు కునేవారు లేరు. పోనీ అని స్థానిక ప్రజలకైనా ఒరిగేదేమీ ఉండదు. మిలిటెన్సీ ఉందన్న పేరిట భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించటం ఒక్కటే వారికి కనబడేది. అందుకేశాంతియుత పద్ధతుల్లో పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించటం, విద్యుత్ బిల్లుల చెల్లింపు నిలిపివేయటం, సంపూర్ణ బంద్, లాంగ్‌మార్చ్ వంటివి ఈ మూడేళ్లలో ఎన్నో జరిగాయి. సైన్యం పడగనీడలో కాలక్షేపం చేసే ప్రభుత్వానికుండే అధికారాలు అంతంత మాత్రం. ఏ జవాబుదారీతనమూ లేని సైన్యానిదే పెత్తనం. అందుకే ఆక్రమిత కశ్మీర్‌కు ఎదుగూ బొదుగూ లేదు. ఆ ప్రాంత వనరుల్ని కొల్లగొట్టడానికి పాక్ పాలకులు ఒక సృజనాత్మక విధానం కనుక్కున్నారు. 53 మందితో దానికొక అసెంబ్లీ ఉంది. ఆక్రమిత కశ్మీర్‌కు ముఖ్యమంత్రి కాదు... ప్రధాని ఉంటాడు. కానీ అధికారాలన్నీ ఇస్లామాబాద్‌లో కొలువుదీరిన సైనికాధికారుల ఆధిపత్యంవుండే కశ్మీర్ కౌన్సిల్ చేతిలో ఉంటాయి. ఈసారి కేవలం
ఆర్థిక సమస్యలపై మాత్రమే కాదు... అసెంబ్లీ అమరికపై కూడా డిమాండ్లు బయల్దేరాయి. మొత్తం 53 స్థానాలుండగా, 'శరణార్థుల'కు డజను కేటాయిస్తారు. మరో అయిదు మహిళలకూ... ఉలేమాలు, సాంకేతిక నిపుణులు, విదేశాల్లో స్థిరపడిన కశ్మీరీలకు ఒక్కొక్క స్థానం ఉంటాయి. ఈ ఖాతాలకింద పోయే 20 స్థానాలకూ ఎన్నికలు జరిగేదెక్కడో, నిర్వహించేదెవరో ఎవరికీ తెలియదు. వారు ఎన్నుకోవాల్సింది మాత్రం 33 మందిని. మళ్లీ ఇందులో అత్యధికులు పాక్ పాలకుల కనుసన్నల్లో నడిచేవారే ఉంటారు. చివరకు కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఉద్యమకారులు అడిగేదల్లా 'శరణార్థుల' డజను స్థానాలూ రద్దు చేయాలన్నదే. కానీ అలా చేస్తే స్థానికుల పెత్తనం పెరుగుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే జాక్ నాయకుల ఆచూకీ చెబితే 35,000 డాలర్లు బహుమతి ఇస్తామని ప్రకటించింది. వచ్చే నెల్లో ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ప్రాంత వనరుల దోపిడీ తప్ప, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం సాధ్యపడదని ఉద్యమాలను అణిచేయటం ద్వారా పాక్ చెబుతోంది. పాలకులు వలసవాద మనస్తత్వంతో ఆప్రాంతాన్ని చెరబట్టారు తప్ప, స్థానికుల డిమాండ్లపై ఖాతరు లేదు. ఉద్యమకారులు38 కోర్కెలు ప్రభుత్వం ముందుంచారు. డజను సీట్ల కోటా రద్దుతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులకిస్తున్న ఖరీదైన కార్లు, ఉచిత విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేసి, ఆ నిధులు జన సంక్షేమానికి వ్యయం చేయాలని కూడావారు కోరుతున్నారు. ఇలాగే మొండికేస్తూ పోతే ఆ ప్రాంత ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుందే తప్ప చల్లారదని పాకిస్తాన్ పాలకులు గ్రహించాలి.

# కాంగ్రెస్ దమనం కమలం మౌనం




జాతీయ స్థాయిలో పేరుకు అధికార, ప్రతిపక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ లో విలువలు వదిలేసి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నా యి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయకుంటే, బీజేపీ మాట్లాడదు, పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుంటే కనబడదు. రోజుకో భూదందా వెలుగు చూస్తుంటే పట్టించుకోదు. ఆఖరికి పేదల ఇండ్లు కూల్చుతుంటే గళమెత్తదు. మరి ఏం చేస్తుందంటే... అధికార పార్టీతో రాసుకుపూసుకొని తిరుగుతూ, కుదిరిన చోట దందాల్లో చేతులు కలుపుతూ 'నవ్విపోదురు గాక నాకేటి...' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు ప్రజల్లో బలంగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే ప్రజల సమస్యల విషయంలో కాంగ్రెస్, బీజేపీ నిజంగానే వేర్వేరు పార్టీలేనా? లేక ప్రజల బాధల దగ్గరకు వచ్చేసరికి రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయా? ఎందుకంటే గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో జరిగిన అనేక కీలక ఘటనలను ప్రజలు గమనిస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక చర్యల ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో ప్రతిపక్షంగా ఉండాల్సిన బీజేపీ ఆశ్చర్యకరమైన మౌనం పాటించిందనే భావన బలపడుతున్నది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేసినప్పుడు, తమ భూముల కోసం గిరిజనులు పోరాడినప్పుడు, ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడినప్పుడు, హామీల అమలు కోరుతూ నిరుద్యోగ యువత ధర్నాలు చేసినప్పుడు, ఇండ్ల కూల్చివేతలు జరిగినప్పుడు పేదలు ఆర్తనాదాలు పెట్టినప్పుడు బీజేపీ ఎక్కడ ఉన్నదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజల గొంతుకగా నిలుస్తున్నది, సమస్యలపై నిరంతరం పోరాడుతున్నది, బీఆర్ఎస్ మాత్రమేననే అభిప్రాయం తెలంగాణలో రోజు రోజుకూ ప్రత్యక్ష సాక్ష్యాలతో నిరూపితమవుతున్నది. లగచర్ల ప్రాంతం లో గిరిజనుల భూములను ఫార్మా కంపెనీల పేరిట స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. తరతరాలుగా జీవనాధారంగా ఉన్న భూమిని కోల్పోతామనే భయంతో గిరిజన కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారిపై దమనకాండ జరిగింది. కానీ బీజేపీ నాయకత్వం నుంచి స్పందన కనిపించలేదు. గిరిజన గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించలేదు. గిరిజనుల తరఫున బలంగా మాట్లాడింది, పోరాడింది బీఆర్ఎస్ నాయకత్వమే.తెలంగాణ ప్రభుత్వ అప్పులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాలను ప్రైవేటుకు కట్టబెట్టాలని పాలక పెద్దలు కుట్ర చేశారు. రాత్రికి రాత్రి 120 ఎకరాల అడవిని నరికివేశారు. ఈ భూములను విద్యాభివృద్ధికి, వర్సిటీ భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాలని విద్యార్థులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం మాత్రం రియల్ ఎస్టేట్ కోణంలో ఆలోచించింది. ఈ అంశంలో కూడా కాంగ్రెస్, బీజేపీ ములాఖత్ స్పష్టంగా కనిపించింది. కేంద్ర విద్యాసంస్థల భూముల పరిరక్షణ గురించి బీజేపీ స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. రైతులకు యూరియా అందకపోవడం వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుభరోసా ఎగవేతలు పరిపాటిగా మారిపోయాయి. ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టింది. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడాల్సిన దుస్థితి వచ్చింది. రైతులు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనకపోవడంతో కల్లాల్లో, మార్కెట్లలో ఎక్కడ చూసినా ధాన్యం పేరుకుపోయింది. పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇందులో ఏ అంశంపైనా బీజేపీ పట్టించుకున్న పాపానపోలేదు. రైతుకు అండగా నిలిచింది బీఆర్ఎస్. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదలకు చెందిన దాదాపు వెయ్యి ఇండ్లను ప్రభుత్వం కూల్చివేసింది. చిన్న పిల్లలు రోడ్డున పడటం, మహిళలు కన్నీళ్లు పెట్టుకోవడం, పేద కుటుంబాలు ఒక్కరాత్రిలోనే నిరాశ్రయులవడం యావత్తు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఇంత పెద్ద మానవీయ విషాదం జరిగినప్పటికీ బీజేపీ నేతలు బాధితులను పరామర్శించలేదు. కేరళకు చెందిన అప్పటి సీఎం పినరయి విజయన్ కూడా ఈ విషయంపై స్పందించారు. కానీ గల్లీ నాయకత్వం నుంచి ఢిల్లీ నాయకత్వం వరకు కనీసం స్పందించలేదు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల నివాస ప్రాంతాలపై జరిగిన అరాచక చర్యలు కూడా ప్రజల్లో భయాందోళనలు సృష్టించాయి. ఈ అంశంలో బీజేపీ నాయకత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయకుండా, కుదిరితే సమర్థిస్తూ వచ్చింది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ప్రభుత్వం పట్ల, ప్రభుత్వ పెద్దల పట్ల ఆగ్రహంతో ఉన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నమ్మబలికింది. కానీ ఆ హామీల అమలుకోసం యువత ధర్నాలు చేస్తే అరెస్టులతో వేధించింది. ఇంత జరుగుతున్నా బీజేపీ ఎందుకు స్పందించలేదు? ఈ సమయంలో నిరుద్యోగుల తరఫున నిరంతరం మాట్లాడింది బీఆర్ఎస్. నిరుద్యోగులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలుస్తూ గళమెత్తారు. కుమ్మర గ్రామంలో జరిగిన విషాద ఘటనలో రెండు నెలల చిన్నారి ప్రాణం కోల్పోవడం రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కదిలించింది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉన్నది. బాధితులకు న్యాయం జరగాలని బీఆర్ఎస్ పోరాడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో బీజేపీ నాయకత్వం విఫలమైంది. ఓ బీజేపీ నాయకుడి కుమారుడు, ఓ బాలికపై అఘాయిత్యం చేశాడని పోక్సో కేసు నమోదు కాగా, ఆ వ్యవహారంపై బీజేపీ మాట్లాడలేదు. విచిత్రంగా కాంగ్రెస్ నేతలు, మంత్రులు మౌనవ్రతం పాటించారు. అంటే దీన్ని బట్టి అర్థమయ్యేది ఏందంటే, ఆ రెండు పార్టీలకు స్వప్రయోజనాలు, రాజకీయలబ్ధి మాత్రమే కానీ, సమాజంలో వివిధ వర్గాల కష్టాలు పట్టవు. లేకపోతే బాలికకు అన్యాయం జరిగిన ఘటనలోనూ రాజకీయ లెక్కలు వేసుకోవడం ఏంది? ప్రజల సమస్యల దగ్గరకు వచ్చేసరికి కాంగ్రెస్ పాలకుల దమనకాండపై బీజేపీ మౌనం వహిస్తున్నది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని నిరంతరం మాట్లాడేది, ప్రజల సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా ప్రజల కోణంలో చూసేది, ప్రజల తరఫున గళం వినిపించేది, ఉద్యమాలకు ముందుండేది బీఆర్ఎస్, గులాబీ దళం మాత్రమే. జై తెలంగాణ.

# బిజినెస్

## షావోమీ నుంచి షావోమీ 17టీ ఫోన్ విడుదల.. బెస్ట్ కెమెరా, పవర్‌ఫుల్ బ్యాటరీ.. పూర్తి ఫీచర్లు, ధర ఇవే




చైనాకు చెందిన షావోమీ సంస్థ నుంచి షావోమీ 17టీ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఇటీవల ఇండియాలో విడుదలైంది. దాదాపు ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో, కాస్త అందుబాటు ధరలోనే ఈ ఫోన్ విడుదలైంది. ఇప్పటికే సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, క్వాలిటీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి. షావోమీ వెబ్‌సైట్, అమెజాన్, రిటైల్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ కొంటే ఏడాదిలోపు 60 శాతం బైబ్యాక్ ఆఫర్ కూడా ప్రకటించింది కంపెనీ. ఈ ఫోన్ కొంటే 4 నెలల స్పాటిఫై ప్రీమియం, 3 నెలల యూట్యూబ్ ప్రీమియం, గూగుల్ ఏఐ వంటివి ఉచితంగా పొందవచ్చు. వివిధ కార్డులపై డిస్కౌంట్‌తోపాటు ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ కూడా ఇస్తోంది. ఈ ఫోన్‌లోని కీలక ఫీచర్లివి. 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 3,500 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, మీడియాటెక్ డిమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ హైపర్‌ఓఎస్ 3, 50 ఎంపీ లైట్ ఫ్యూజియన్ 800 మెయిన్ కెమెరాం50ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరాం12ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, 12జీబీం256జీబీ, 12జీబీం512జీబీ, బ్లూటూత్ 6.0, వైఫై 7, ఐపీ68 రేటింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5 వాట్స్ రివర్స్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి. ధర రూ.59,999/రూ.64,999.

## హైదరాబాద్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్




**హైదరాబాద్:** అమెరికా ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ టెస్లా.. హైదరాబాద్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈ నెల 17న హైటెక్ సిటీలో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించనుంది. మన దేశంలో టెస్లాకిది ఐదో సెంటర్. కాగా.. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని ఆక్టేవ్ బ్లాక్‌లో రానున్న ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో 6 సీటింగ్ కెపాసిటీ టెస్లా వై ఎల్ (లాంగ్-- వీల్ బేస్) మోడల్ కారును ప్రదర్శించనున్నారు. 88 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ, డ్యూయల్ మోటార్ ఏడబ్ల్యూడీ సిస్టమ్ ఫీచర్స్‌తో ఉన్న ఈ కారు.. 5 సెకన్ల వ్యవధిలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఎక్స్ షోరూం ప్రారంభ ధర రూ.61.99 లక్షలు. ఇప్పటికే ఢిల్లీ, గుర్గావ్, ముంబై, బెంగళూరులో కొలువుదీరిన టెస్లా షోరూమ్‌లు.. తాజాగా భాగ్యనగరానికి రానున్నాయి

## 2.5 లక్షల్లో స్క్రాంబ్లర్ బైక్ కొనాలా?

# ఈ రెండింటిలో ఏది బెస్ట్?




భారత మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గుంతలు, కంకర రోడ్లు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ స్మూత్ రైడింగ్ సామర్థ్యంతో ఉండటంతో యూత్ స్క్రాంబ్లర్ బైక్‌లవైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ స్క్రామ్ 440ని అందుబాటులోకి తీసుకురాగా.. ఇటీవల యెజ్డీ నుంచి సరికొత్త స్క్రాంబ్లర్ బైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో ఈ రెండు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి వీటిలో ఏది బెస్ట్ అనేది ఒకసారి పరిశీలిద్దాం..

**ఇంజిన్-పనితీరు**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443సీసీ సామర్థ్యం గల సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 25.4బీహెచ్‌పీ పవర్, 34ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ గేర్‌బాక్స్ అమర్చారు. ముఖ్యంగా తక్కువ ఆర్‌పీఎం వద్ద ఎక్కువ టార్క్ అందించడం వల్ల కొండ ప్రాంతాలు, కఠినమైన రోడ్లపై ప్రయాణానికి ఇది అనుకూలంగా ఉంటుంది.

అదే యెజ్డీ స్క్రాంబ్లర్ 334 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 29.59బీహెచ్‌పీ పవర్, 30 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పవర్‌పరంగా యెజ్డీ స్క్రాంబ్లర్ ముందంజలో ఉండగా, టార్క్ విషయంలో స్క్రామ్ 440 ముందు ఉంది. వేగవంతమైన యాక్సిలరేషన్, హైవే రైడింగ్‌ను ఇష్టపడేవారికి యెజ్డీ బైక్ బాగా నచ్చే అవకాశం ఉంది.

**డిజైన్**

స్క్రామ్ 440లోసీటు ఎత్తు 795 మిల్లీమీటర్ల ఎత్తులోనే ఉండటంతో పొట్టిగా ఉన్నవారు కూడా సులభంగా నడపగలరు. 200 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉండటం వల్ల గుంతలు, స్పీడ్ బ్రేకర్లపై ఇబ్బంది ఉండదు. దీని వీల్‌బేస్ 1460 మిల్లీమీటర్లు కాగా.. మొత్తం బరువు 196 కిలోలు.

యెజ్డీ స్క్రాంబ్లర్‌లో సీటు ఎత్తు 813 మిల్లీమీటర్ల ఎత్తులో ఉంది. పొడవుగా ఉండే వారికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. బరువు విషయానికి వస్తే ఇది స్క్రామ్ 440 కంటే తక్కువ. దీని బరువు కేవలం 174 కిలోలు మాత్రమే. స్క్రామ్‌తో పోలిస్తే 22 కిలోల వరకు తక్కువ బరువు ఉండటంతో ట్రాఫిక్‌లో, టార్నింగ్స్‌లో మరింత చురుకైన హ్యాండ్లింగ్ ఉంటుంది.

**బ్రేకింగ్-సస్పెన్షన్**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో ముందు 300మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, వెనుక లింకేజ్‌తో కూడిన మోనోషాక్ సస్పెన్షన్ అందించారు. ముందు 190మిల్లీమీటర్లు, వెనుక 180 మిల్లీమీటర్ల సస్పెన్షన్ ట్రావెల్ ఉండటంతో కఠినమైన రోడ్లపై కూడా మంచి సౌకర్యవంతమైన రైడింగ్‌ను అందిస్తుంది.

యెజ్డీ స్క్రాంబ్లర్‌లో ముందు 320 మిల్లీమీటర్లు, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ భద్రత కూడా ఉంది. ముందు టెలిస్కోపిక్ హైడ్రాలిక్ ఫోర్క్, వెనుక ట్విన్ షాక్ అబ్జార్బర్ల వ్యవస్థను ఉపయోగించారు.

**ఇంజిన్ ట్యాంక్- ప్రయాణ సామర్థ్యం**

స్క్రామ్ 440లో 15లీటర్ల పెద్ద ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. లాంగ్ జర్నీలు చేసేవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 12.5 లీటర్ల ట్యాంక్ మాత్రమే ఉంది. అయితే తక్కువ బరువు కారణంగా ఇంధన వినియోగం కొంత మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

**ధర**

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 ప్రారంభ ఎక్స్‌షోరూం ధర రూ.2.23 లక్షలుగా ఉంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్ ప్రారంభ ధర రూ.1.99 లక్షలుగా ఉంది. అంటే యెజ్డీ బైక్ సుమారు రూ.24వేల తక్కువ ధరలో లభిస్తుంది. వీటన్నింటి ఆధారం గదా బలమైన నిర్మాణం, అధిక టార్క్, టూరింగ్ సామర్థ్యం ముఖ్యమైతే రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 సరైన ఎంపిక అని ఆటోమొబైల్ నిపుణులు సూచిస్తున్నారు. అదే తక్కువ బరువు, ఎక్కువ పవర్, చురుకైన హ్యాండ్లింగ్, తక్కువ ధరలో స్క్రాంబ్లర్ కావాలనుకుంటే యెజ్డీ బెటర్ అని చెబుతున్నారు.

## లక్ష రూపాయల ఫోన్.. ఇప్పుడు సగం ధరకే!



ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనాలని చాలా మందికి ఉంటుంది. అయితే అందుకు వారి బడ్జెట్ సహకరించదు. ఎందుకంటే వాటి ధరలు రూ.లక్ష వరకు ఉంటాయి. ఇలాంటి కస్టమర్లకు శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ ఇప్పుడు ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. భారత్‌లో ఈ ఫోన్‌ను గతేడాది మేలో రూ.1,09,999 ప్రారంభ ధరతో విడుదల చేసిన శామ్‌సంగ్, ప్రస్తుతం ఈ మోడల్‌పై భారీ డిస్కౌంట్ అందిస్తోంది. అధికారిక లాంచ్ సమయంలో రూ.1 లక్షకు పైగా ధర కలిగిన ఈ ఫోన్, ప్రస్తుతం ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో రూ.60 వేల పరిధిలోనే లభిస్తోంది. ప్రస్తుతం 12+దీ ర్యామ్ ం 256+దీ స్టోరేజ్ వేరియంట్ సుమారు రూ.59,999కు, 512+దీ వేరియంట్ రూ.71,999కు అందుబాటులో ఉన్నట్లు ఆన్‌లైన్ ఆఫర్లు సూచిస్తున్నాయి. దీంతో అసలు లాంచ్ ధరతో పోలిస్తే దాదాపు రూ.50,000 వరకు తగ్గింపు లభిస్తోంది. కొన్ని బ్యాంక్ కార్డులపై అదనపు ఇన్‌స్టంట్ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. గెలాక్సీ ఎస్25 ఎడ్జ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని అల్ట్రా-స్లిమ్ డిజైన్. కేవలం 5.8 మిల్లీమీటర్ల మందం, 163 గ్రాముల బరువుతో ఇది శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన అత్యంత సన్నని ఫోన్‌గా గుర్తింపు పొందింది. టైటానియం ఫ్రేమ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ సిరామిక్ 2 రక్షణతో ప్రీమియం లుక్‌తో పాటు మన్నికను కూడా అందిస్తోంది.

# స్పోర్ట్స్

# మెరిసిన గిల్, రాహుల్.. అఫ్గాన్‌పై భారత్ ఘన విజయం

ధర్మశాల: అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా అదే జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84ు; 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఇషాన్ కిషన్ (34), కేఎల్ రాహుల్ (39ు; 19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (16) పరుగులు చేశారు. రెండో వన్డే బుధవారం (జూన్ 17) లఖ్‌నవూలో జరగనుంది. జియావుర్ రెహ్మాన్ వేసిన 22 ఓవర్లో కేఎల్ రాహుల్ వరుసగా 6, 4, 4 బాదేశాడు. ఇదే ఓవర్లో చివరి బంతిని కూడా రాహుల్ స్టాండ్స్‌లోకి పంపాడు. 22 ఓవర్లకు స్కోరు 182/3. టీమ్‌ఇండియా విజయానికి 18 బంతుల్లో 13 పరుగులు అవసరం. జియావుర్ రెహ్మాన్ వేసిన 18 ఓవర్లో శ్రేయస్ అయ్యర్ (12) ఔటయ్యాడు. దీంతో భారత్ 142 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. టీమ్‌ఇండియా విజయానికి 45 బంతుల్లో 53 పరుగులు అవసరం. రషీద్ ఖాన్ వేసిన 13 ఓవర్లో ఇషాన్ కిషన్ (34) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 13 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 117/2.

**గిల్‌ఏ3000**

భారత కెప్టెన్ శుభ్‌మన్ నిలకడగా ఆడుతూ 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మహ్మద్ నబీ వేసిన 12 ఓవర్‌లో గిల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాది హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఈ క్రమంలో వన్డేల్లో వేగంగా (62 ఇన్నింగ్స్‌లు) 3 వేల పరుగులు పూర్తి చేసుకున్న భారత ఆటగాడిగా గిల్ రికార్డు సృష్టించాడు. 12 ఓవర్లకు భారత్ 109/1. టీమ్‌ఇండియా విజయానికి ఇంకా 78 బంతుల్లో 86 పరుగులు అవసరం. ఇషాన్ కిషన్ (32) పరుగులతో ఉన్నాడు. అఫ్గాన్ నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యఛేదనలో భారత బ్యాటర్లు నిలకడగా ఆడుతున్నారు. ఇషాన్ కిషన్ (30), గిల్ (29) క్రమంగా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు కదిలిస్తున్నారు. 10 ఓవర్లకు స్కోరు 84/1.

**రోహిత్ రనౌట్**

అఫ్గాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. రోహిత్ శర్మ (16; 16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఔటయ్యాడు. ఘజన్‌ఫర్ వేసిన ఆరో ఓవర్‌లో బంతిని ఎదుర్కొన్న రోహిత్.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయలోపంతో రనౌటయ్యాడు. 6 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 47/1. గిల్ (22), ఇషాన్ కిషన్ (1) క్రీజులో ఉన్నారు.




**ఓపెనర్‌గా 16 వేల పరుగులు**

తొలి వన్డేలో భారత్‌కు అఫ్గాన్ 195 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టార్గెట్‌ను ఛేజ్ చేసేందుకు టీమ్‌ఇండియా బరిలోకి దిగింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (6) నిలకడగా ఆడుతున్నారు. 3 ఓవర్లకు భారత్ స్కోరు 29/0. అజ్మతుల్లా బౌలింగ్‌లో రోహిత్ సిక్స్ కొట్టాడు. ఈ సిక్సర్‌తో హిట్‌మ్యాన్ వన్డేల్లో ఓపెనర్‌గా 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

**భారత్ టార్గెట్ 195**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ బ్యాటింగ్ ముగిసింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (102; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) 'శత'క్కొట్టి జట్టును ఆదుకున్నాడు. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మనుల్లా జట్టును ఆదుకున్నాడు. హష్మతుల్లా (27)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 బంతుల్లోనే 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 15 ఓవర్లకు 140/3తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించిన అఫ్గాన్.. గుర్బాజ్ ఔటైన తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. అరంగేట్ర బౌలర్లు గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబెలకు చెరో మూడు వికెట్లు దక్కాయి. అర్ష్‌దీప్ 2, నితీశ్ రెడ్డి రెండు వికెట్లు పడగొట్టారు.

**శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్..**

అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (26; 16 బంతుల్లో) పెవిలియన్ చేరాడు. హర్ష్ దూబె వేసిన 22 ఓవర్‌లో తొలి బంతికి భారీ సిక్స్ బాదిన ఒమర్‌జాయ్.. తర్వాత బంతికే స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన ఘజన్‌ఫర్ డకౌటయ్యాడు. హర్ష్ దూబె బౌలింగ్‌లోనే (21.4 ఓవర్) స్లిప్‌లో శుభ్‌మన్ గిల్ డైవ్ చేస్తూ ఒంటిచేత్తో కళ్లు చెదిరే క్యాచ్ అందుకోవడంతో ఘజన్‌ఫర్ ఔటయ్యాడు.

**సిక్స్.. వెంటనే ఔట్**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గాన్ ఆరో వికెట్ కోల్పోయింది. మహ్మద్ నబీ (9) ఔటయ్యాడు. నితీశ్ రెడ్డి బౌలింగ్‌లో భారీ సిక్స్ కొట్టిన నబీ.. తర్వాత బంతికే అర్ష్‌దీప్ సింగ్‌కు చిక్కాడు. దీంతో అఫ్గాన్ 172 పరుగుల వద్ద ఆరో వికెట్ కోల్పోయింది. 21 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 176/6. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (20), రషీద్ ఖాన్ (4) క్రీజులో ఉన్నారు.

**హర్ష్ దూబెకు తొలి వికెట్**

అఫ్గానిస్థాన్ ఐదో వికెట్ కోల్పోయింది. అరంగేట్ర బౌలర్ హర్ష్ దూబె వేసిన 16.3 ఓవర్‌కు హష్మతుల్లా షాహిదీ (27).. రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. హర్ష్ దూబెకు వన్డేల్లో ఇది తొలి వికెట్. 17 ఓవర్లకు అఫ్గానిస్థాన్ స్కోరు 144/5. మహ్మద్ నబీ (0), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (2) క్రీజులో ఉన్నారు.

**గుర్బాజ్ సెంచరీ**

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (101; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన అఫ్గాన్‌ను గుర్బాజ్ అదిరే బ్యాటింగ్ చేసి ఆదుకున్నాడు. 25 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గుర్బాజ్ తర్వాత మరింత దూకుడు పెంచాడు. చివరకు నితీశ్ రెడ్డి వేసిన 16 ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 16 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 143/4. హష్మతుల్లా షాహిదీ (27), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (1) క్రీజులో ఉన్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించిన సంగతి తెలిసిందే.

**దూకుడు పెంచిన గుర్బాజ్**

అఫ్గాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ హాఫ్ సెంచరీ తర్వాత మరింత దూకుడు పెంచాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 11 ఓవర్లో 4, 6 బాదిన అతను.. తర్వాత వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఓ ఫోర్ రాబట్టాడు. 12 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 110/3. రహ్మనుల్లా (86) సెంచరీ దిశగా సాగుతున్నాడు. హష్మతుల్లా షాహిదీ (17) పరుగులతో ఉన్నాడు. భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ దూకుడుగా ఆడుతున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఏడో ఓవర్లో రెండు ఫోర్లు, హర్ష్ దూబె బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ బాదాడు. మళ్లీ ప్రసిద్ధ్ బౌలింగ్‌లో గుర్బాజ్ వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. హర్ష్ దూబె వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్ కొట్టి 25 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 79/3. రహ్మనుల్లా (57), హష్మతుల్లా షాహిదీ (16) క్రీజులో ఉన్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఓడిన పీవీ సింధు




సిడ్నీ: ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో హైదరాబాదీ ప్లేయర్ పీవీ సింధు ఇవాళ సెమీఫైనల్లో ఓటమి చవి చూసింది. జపాన్‌కు చెందిన మేటి ప్లేయర్ అకేన్ యమగుచి చేతిలో ఆమె వరుస గేమ్స్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నది. 20-22, 12-21 స్కోరుతో యమగుచి విజయం సాధించింది. మూడో నెంబర్ ర్యాంక్‌తో జపనీస్ ప్లేయర్ ఈ టోర్నీలో ఆడారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసిపోయింది. సింధు ఓటమితో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారతీయ క్రీడాకారుల ప్రాతినిధ్యం ముగిసింది. ఫస్ట్ గేమ్‌లో జపాన్ ప్లేయర్‌కు ధీటుగా సింధు ఆడింది. షాట్‌కు షాట్ కొట్టింది. ఇద్దరు ఆటగాళ్లు ఓ దశలో ఆరు వరుస పాయింట్లను సాధించుకున్నారు. కానీ గేమ్ పాయింట్ వద్ద సింధు తడబడింది. ఓపెనింగ్ గేమ్‌ను యమగుచి చేజిక్కించుకున్నది. ఇక సెకండ్ గేమ్‌లో సింధు ఆటతీరు పూర్తిగా మారిపోయింది. యమగుచి చాలా ఈజీగా దూసుకెళ్లింది. ఓ దశలో 13-6 పాయింట్లు సాధించింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండానే యమగుచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నది. ఇక సింగిల్స్ ఫైనల్లో థాయ్‌ల్యాండ్ క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌తో యమగుచి తలపడనున్నది. ఇటీవల కాలం యమగుచి చేతిలో సింధు వరుసగా ఓటమి ఎదుర్కొన్నది. ఆరు మ్యాచుల్లో అయిదు సార్లు ఓడంది. కానీ ఓవరాల్‌గా 15-13 తేడాతో సింధు లీడింగ్‌లో ఉంది.

## 'పెద్ది' బాక్సాఫీస్ దూకుడు .. 9 రోజుల్లో రూ.366 కోట్ల గ్రాస్, 400 కోట్ల క్లబ్‌కు చేరువ!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, విదేశీ మార్కెట్లలో కూడా సినిమా మంచి వసూళ్లు నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగు వార్తలు వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది. 'పెద్ది' బాక్సాఫీస్ ప్రయాణం ఇంకా కొనసాగుతుండటంతో, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి రూ.400 కోట్ల క్లబ్‌పై నిలిచింది. ఈ మైలురాయిని సినిమా ఎంత వేగంగా చేరుకుంటుందో చూడాలి.

## తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!



'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.



## 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ దగ్గర బిగ్ అడ్వాంటేజ్.. సమంత సినిమాకు పోటీ తగ్గిందా?

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి బాక్సాఫీస్ పరంగా మరో భారీ ప్లస్ పాయింట్ దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొదట 'మా ఇంటి బంగారం' విడుదల సమయంలో కొన్ని క్రేజీ సినిమాలు కూడా బరిలోకి దిగనున్నట్లు వార్తలు వినిపించాయి. ముఖ్యంగా అక్కినేని హీరో నటిస్తున్న 'లెనిన్' సినిమా అదే సమయంలో విడుదలవుతుందని భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు 'లెనిన్' జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా తొలి రెండు వారాల పాటు ప్రేక్షకుల దృష్టిని పూర్తిగా ఆకర్షించే అవకాశం ఈ చిత్రానికి లభించవచ్చని భావిస్తున్నారు. సినిమా విడుదలైన మొదటి వారంలో పాజిటివ్ టాక్ అందుకుంటే, రెండో వారంలో కూడా వసూళ్ల పరంగా బలంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ తగ్గడం సమంత సినిమాకు అదనపు బలంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాలీవుడ్ యాక్షన్ క్లాసిక్ 'కిల్ బిల్' తరహా యాక్షన్ ఎలిమెంట్స్‌ను తెలుగు కుటుంబ కథాంశంతో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే పాత్రలో రెండు భిన్న కోణాలు ఉండనున్నాయని, అవి కథలో కీలక మలుపులకు కారణమవుతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సమంత అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం సమంత కెరీర్‌లో కూడా ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. ఎందుకంటే స్టార్ హీరోల సహకారం లేకుండా పూర్తిగా ఆమె ఇమేజ్, నటన, కథ బలంపై సినిమా రూపొందుతోంది. లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతమైతే సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,